# ప్రజాక్షేత్రం
PRAJA KSHETRAM
ప్రతీ క్షణం.. ప్రజల పక్షం



రిపోర్టర్లు కావలెను
కాల్ : 9177920459



సంపుటి: 01 | సంచిక: 300 | హైదరాబాద్ | బుధవారం | 16-04-2025 | పేజీలు: 08


## కాంగ్రెస్‌ను మేము కూల్చబోము..

### కానీ మళ్లీ అధికారంలోకి మేమే వస్తాం

కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలని ప్రజల ఆకాంక్ష: కొత్త ప్రభాకర్
కాంగ్రెస్పై విమర్శలు
బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్న ధీమా
లై డిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధం – కాంగ్రెస్ మంత్రులకు సవాల్



2

## బరాబర్ పింక్ బుక్కులో వాళ్ల పేర్లను రాసుకుంటాం

బీఆర్ఎస్ రజతోత్సవ సభ పై బెదిరింపులు - కవిత ఘాటు వ్యాఖ్యలు


కాంగ్రెస్ హామీలు మోసం - గ్యారెంటీ కార్డులపై కవిత విమర్శలు

"భయపడేది లేరు... వదిలిపెట్టేది లేదు" - రాజకీయ ప్రత్యర్థులకు కవిత హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):** బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రజతోత్సవ సభకు వెళ్లవద్దని కొంతమంది ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లు సమాచారం ఉందని ఆమె చెప్పారు. “ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటాం,” అంటూ హెచ్చరించారు. బెదిరింపులకు పాల్పడే వారిని వదిలిపెట్టేది లేదని, పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వారిని క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కవిత, కాంగ్రెస్ నాయకుల పై కూడా విమర్శల వర్షం కురిపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే

మిగతా 2వ పేజీలో..





### కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

02

## రాష్ట్ర విపత్తుగా వడదెబ్బ..

మరణిస్తే 4 లక్షల ఎక్స్‌గ్రేషియా..!



2

## దుబాయ్‌లో దారుణం..

పాకిస్తానీ చేతిలో తెలంగాణకు చెందిన ఇద్దరు హత్య

02

## గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా చలివేంద్రాల ఏర్పాటు..

గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటుతో
వేసవి దాహం తీర్చేందుకు చర్యలు
సీతక్క ఆదేశాల మేరకు
పీఆర్ఆర్‌డీ 8090 చలివేంద్రాలు ఏర్పాటు
ప్రత్యేక నిధుల కేటాయింపుతో
తాగునీటి సమస్యలకు పరిష్కారం



2

## "పార్టీ మారే ప్రసక్తే లేదు"

- ఊహాగానాలకు బ్రేక్ వేసిన జీవన్ రెడ్డి
- "నా సీనియారిటీకి గౌరవం లేదు, కానీ కాంగ్రెస్‌నే వదలను" – అసంతృప్తి వెలిబుచ్చిన జీవన్
- "చివరి 40 ఏళ్లుగా నేను అంటే కాంగ్రెస్" – తన పాత్రను గుర్తుచేసిన జీవన్ రెడ్డి



2



### గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యలు

2

### కేసీఆర్ సూచనతోనే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు

మంత్రి పొంగులేటి

02

## మాతో కలిసి నడవండి.. బహుజన శక్తిని చాటి చెప్పండి

- సంక్షేమం , సామాజిక న్యాయం.. కాంగ్రెస్ పాలనలో చారిత్రాత్మక మార్పులు
- బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ దేశానికి మార్గదర్శకాలు
- బీఆర్ఎస్-బీజేపీ కుట్రలకు ప్రజలు బలి కాదన్న భట్టి



2

## కాంగ్రెస్‌లో కాక రేపిన జానా లేఖ.. మళ్లీ అటకెక్కిన క్యాబినెట్ విస్తరణ

జానారెడ్డి షాక్..
విస్తరణకు బ్రేక్!
ఫలించని అధిష్ఠానం
4+2 ఫార్ములా
ముసలం పుడుతుందని
సంకేతాలు
గళం విప్పుతున్న
ఆశావహ నేతలు



3

## ఎంపీ చామలకు సీఎం రేవంత్ సీరియస్ వార్నింగ్..

మంత్రి వర్గ విస్తరణపై సీఎం రేవంత్ కట్టుదిట్టమైన హెచ్చరిక
నియోజకవర్గ ప్రాజెక్టులకు సీఎం నుంచి పూర్తి మద్దతు హామీ
పార్టీ విజయంపై రేవంత్ రెడ్డి ఫోకస్ - ఎమ్మెల్యేలకు స్పష్టమైన దిశానిర్దేశం



2

## అక్కడ జంతువులు ఉంది అవాస్తవమా?

- నేను పెట్టిన పోస్ట్ కు కట్టుబడి ఉన్నా..
- పునర్విభజన అంశం ప్రస్తుతం చర్చలో లేదు
- తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి



2

# కాంగ్రెస్‌ను మేము కూల్చబోము..

- కానీ మళ్లీ అధికారంలోకి మేమే వస్తాం
- కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలని ప్రజల ఆకాంక్ష: కొత్త ప్రభాకర్
- కాంగ్రెస్పై విమర్శలు – బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్న ధీమా
- లై డిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధం – కాంగ్రెస్ మంత్రులకు సవాల్

**హైదరాబాద్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మరోసారి తన దూకుడు వ్యాఖ్యలతో హాట్ టాపిక్ అయ్యారు. మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆయన, పార్టీ నేతలపై ఘాటుగా విరుచుకుపడ్డారు. కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చమని మా నాయకుడు కేసీఆర్ ఎప్పుడూ చెప్పలేదు. అలాగే మేము కూడా ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశంతో లేము. ప్రజలు స్వయంగా నిర్ణయం తీసుకుంటారు. కొన్ని రోజుల్లో మళ్లీ అధికారంలోకి మేమే వస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు.

"ప్రజలు, బిల్డర్లు, వ్యాపారవేత్తలు స్వచ్ఛందంగా మా పార్టీకి విరాళాలు ఇస్తున్నారు. వారు తిరిగి BRS పార్టీ అధికారంలోకి రావాలని ఆశిస్తున్నారు. కేసీఆర్ గారే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారు" అని కొత్త ప్రభాకర్ చెప్పారు. తాను చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా స్పందించడాన్ని తప్పుపడిన కొత్త ప్రభాకర్ రెడ్డి, "మీకు మీ పార్టీపై నిజంగా నమ్మకం ఉంటే మా 10 మంది ఎమ్మెల్యేలను ఎందుకు చేర్చుకున్నారు? నేను చేసిన వ్యాఖ్యలకు పూర్తిగా కట్టుబడి ఉన్నాను. అవసరమైతే లై డిటెక్టర్ టెస్టుకు నేను సిద్ధంగా ఉన్నాను. కాంగ్రెస్ మంత్రులు కూడా అదే ధైర్యం చూపించగలరా?" అంటూ సవాల్ విసిరారు. అంతేకాక, తనను అడ్డుకున్నా, తనపై కేసులు పెట్టినా తాను భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నాయకులుగా ప్రజల అభిప్రాయాన్ని వినిపించడం తాము చేసే పని మాత్రమేనన్నారు.

# బరాబర్ పింక్ బుక్కులో వాళ్ల పేర్లను రాసుకుంటాం

మొదటిపేజి తరువాయి

అధికారులను, నాయకులను ఉపేక్షించమని స్పష్టం చేశారు. "వాళ్ల తాతలు, ముత్తాతలు, జేజమ్మలు ఎవరు దిగొచ్చినా భయపడేది లేరు ఇక్కడ," అని కవిత ఘాటు వ్యాఖ్య చేశారు. "మాట తప్పడమే, మడమ తిప్పడమే కాంగ్రెస్ నైజం" అంటూ ఆమె విమర్శించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారెంటీ కార్డులను ఇంటింటికీ పంచి ఓట్లు సాధించారని, కానీ ఇప్పుడు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.

"గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్ల పాటు అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీ. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణం అదే పార్టీ," అని కవిత విమర్శించారు. "ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలి," అంటూ ఆమె వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. చివరిగా, "ప్రతి ఇంటి నుంచి ఒక్కరు బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తప్పకుండా రావాలి," అని పిలుపునిచ్చారు.

# గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా చలివేంద్రాల ఏర్పాటు..

- గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటుతో వేసవి దాహం తీర్చేందుకు చర్యలు
- సీతక్క ఆదేశాల మేరకు పీఆర్ఆర్డీ 8090 చలివేంద్రాలు ఏర్పాటు
- ప్రత్యేక నిధుల కేటాయింపుతో తాగునీటి సమస్యలకు పరిష్కారం

**హైదరాబాద్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

వేసవి దాహాన్ని తీర్చేందుకు పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి (పీఆర్ఆర్డీ) శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, మండల కేంద్రాల్లో భారీ సంఖ్యలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 8,090 చలివేంద్రాలు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. వేసవి కాలంలో పనుల నిమిత్తం బయటకు వచ్చే ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ చర్యలు చేపట్టబడ్డాయి.

మంత్రి సీతక్క స్పష్టమైన ఆదేశాలతో పీఆర్ఆర్డీ అధికారులు గ్రామాల నుంచీ రద్దీ ప్రాంతాల వరకు ప్రతి చోట చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలు విరివిగా ఈ సేవలను వినియోగించుకుంటుండగా, మంత్రి సీతక్క విస్తృతంగా చలివేంద్రాల ఏర్పాటుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా పీఆర్ఆర్డీ శాఖ ముందస్తుగా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలోని 31 జిల్లాల కలెక్టర్లకు ఒక్కో జిల్లాకు రూ. కోటి చొప్పున పీఆర్ఆర్డీ సొంత నిధుల నుండి ప్రత్యేక నిధులు కేటాయించబడ్డాయి. ఈ నిధులను అత్యవసర తాగునీటి అవసరాల కోసం ఖర్చు చేయాలని, మిషన్ భగీరథ నుండి నీరు అందని సందర్భాల్లో ప్రజలకు సమస్యలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గతంలో ఫైనాన్స్ శాఖ నుండి ప్రత్యేక నిధుల మంజూరుపై అనుమతులు ఇచ్చినప్పటికీ, వాస్తవంగా నిధుల విడుదల జరగలేదని అధికారులు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం పీఆర్ఆర్డీ సొంత నిధుల ఆధారంగా తక్షణ అవసరాలను తీర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ వేసవిలో గ్రామీణ ప్రజలకు తాగునీటిలో ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పీఆర్ఆర్డీ స్పష్టం చేసింది.

# మాతో కలిసి నడవండి.. బహుజన శక్తిని చాటి చెప్పండి

- సంక్షేమం , సామాజిక న్యాయం.. కాంగ్రెస్ పాలనలో చారిత్రాత్మక మార్పులు
- బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ దేశానికి మార్గదర్శకాలు
- బీఆర్ఎస్-బీజేపీ కుట్రలకు ప్రజలు బలి కాదన్న భట్టి విక్రమార్క

**హైదరాబాద్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ (సీఎల్పీ) సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం కోసం చేపట్టిన చరిత్రాత్మక నిర్ణయాల గురించి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎంతో నిబద్ధతతో పనిచేస్తోందని, లబ్ధిదారులు ఈ పథకాలను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నారని ఆయన ఉద్ఘాటించారు.

భట్టి విక్రమార్క మాట్లాడుతూ, "మేము 21 వేల కోట్లతో రైతు రుణమాఫీ, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, 56 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకం, 8 వేల కోట్లతో యువతకు అవకాశాలు, సన్న ధాన్యంపై రూ.500 బోనస్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాదు, ప్రజల జీవితాల్లో నిజమైన మార్పును తీసుకొస్తున్నాయి," అని అన్నారు.

సంక్షేమం ఒక ఎత్తైతే, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చరిత్రాత్మక నిర్ణయాలు మరో ఎత్తని ఆయన పేర్కొన్నారు. "ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన వంటి అంశాలను మేము పకడ్బందీగా పూర్తి చేశాం. ఈ రెండు అంశాలు గత దశాబ్దాలుగా ఎందరో గొప్ప నాయకులు సాధించలేనివి. మన ప్రభుత్వం ధైర్యంగా, అందరితో చర్చించి, పారదర్శకంగా ఈ లక్ష్యాలను నెరవేర్చింది," అని విక్రమార్క గర్వంగా చెప్పారు.

ఈ నిర్ణయాలు దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని, ఇప్పటికే బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ కోసం డిమాండ్ మొదలైందని ఆయన అభిప్రాయపడ్డారు. "ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును ఆమోదించాం. ఇది సామాజిక న్యాయం దిశగా కాంగ్రెస్ చేసిన గొప్ప అడుగు," అని ఆయన వివరించారు.

కాంగ్రెస్ పార్టీ గతంలో భూసంస్కరణల వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకుందని, అందుకే దేశంలో సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగిందని విక్రమార్క గుర్తు చేశారు. అయితే, బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ వంటి నిర్ణయాలు గతంలో పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలకు రుచించడం లేదని ఆయన విమర్శించారు. "ఈ నిర్ణయాలు వారి అస్తిత్వానికే సవాల్ విసురుతాయి. అందుకే బీఆర్ఎస్, బీజేపీ కలిసి కుట్రలు చేస్తూ, ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు చిత్రీకరిస్తున్నాయి," అని ఆయన ఆరోపించారు.

కంచ గచ్చిబౌలి వివాదంపై కూడా ఆయన స్పందిస్తూ, "కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే భయంతో బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి అసత్య ప్రచారం చేస్తున్నాయి. వారు ఏనుగులు, పులులు తిరుగుతున్నాయని చెప్పినా, ప్రజలు సత్యాన్ని గుర్తిస్తారు," అని వ్యాఖ్యానించారు.

చివరగా, బహుజన వర్గాలను చైతన్యం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. "బీసీ కుల సర్వే మీ కోసం, మీ హక్కుల కోసం కాంగ్రెస్ చేసింది. మాతో కలిసి నడవండి, బహుజన శక్తిని చాటి చెప్పండి," అని ఆయన కోరారు.

# అక్కడ జంతువులు ఉంది అవాస్తవమా?



**నేను పెట్టిన పోస్ట్ కు కట్టుబడి ఉన్నా..**

**హైదరాబాద్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మీడియాతో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా పలు కీలక అంశాలపై స్పందించారు. తనను జాతీయ అధ్యక్షుడిగా నియమించనున్నట్టు వస్తున్న ప్రచారాలను ఖండిస్తూ.. ఇప్పటి వరకు దక్షిణాదిలో కేవలం రెండు రాష్ట్రాలకే అధ్యక్షుల నియామకం జరిగిందని, నన్ను జాతీయ అధ్యక్షుడిగా చేయాలన్న ప్రతిపాదన ఎక్కడా లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశం ప్రస్తుతం పార్టీలో కానీ, కేంద్ర ప్రభుత్వంలో కానీ చర్చలో లేదని తెలిపారు. ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలను అనుసరించి భవిష్యత్తులో బీజేపీ తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

అలాగే తెలంగాణ రాష్ట్రంలో భూముల అమ్మకం ద్వారా ప్రభుత్వాన్ని నడపాలనే కాన్సెప్ట్‌కి తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. భూములు అమ్మడం, అప్పులు చేయడం, మద్యం అమ్మకాలు... ఇవే ఆదాయం సమకూర్చే మార్గాలుగా ఈ ప్రభుత్వం భావిస్తోంది అంటూ ఆరోపించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే పని చేసింది.. ఇప్పుడు కాంగ్రెస్ అదే మార్గాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (HCU) పరిధిలోని చెట్ల కొట్టడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. ఒక్క చెట్టును కొట్టాలన్నా అనుమతి అవసరం. కానీ, ప్రభుత్వం చట్టాలను ఉల్లంఘిస్తూ హెచ్‌సీయు భూముల్లో చెట్లను కూల్చుతోందని విమర్శించారు. అటవీ ప్రాంతంలో జంతువులు ఉన్నాయని, తాను ట్విట్టర్‌లో పెట్టిన పోస్ట్‌కు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. అక్కడ జంతువులు ఉంది అవాస్తవమా అంటూ ప్రశ్నించారు.

అలాగే, ఈ భూముల వెనుక మా ఎంపీ ఉంటే ఆ పేరును బయటపెట్టండని, ఎవరు అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. యూనివర్సిటీ అధికారులు కూడా ఈ భూములు హెచ్‌సీయువే అని స్పష్టంగా చెబుతున్నారని గుర్తు చేశారు. అలాగే హైదరాబాద్ లో ఉన్న పలు బిల్డింగ్‌ల్లో ఫ్లాట్ లు ఖాళీగా ఉన్నాయి.. వాటిని కొనేందుకు ఎవరు రావడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేము పోరాడడం లేదు.. అక్కడ గ్రీనరీ అలానే ఉండాలని మా పోరాటమని అన్నారు. HCU లో జంతువులు ఉన్న మాట వాస్తవం.. నా మీద కేసు పెట్టిన ఎదుర్కోవడానికి నేను సిద్ధం, ఎప్పుడు ఎన్నికలు జరిగిన కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోతుందని అన్నారు. వేరే రాష్ట్రం వ్యాపారస్తులు ఇక్కడ ప్రభుత్వాన్ని కూల్చుతారు వారికేమి పని.. వక్ఫ్ చట్టంపై ఆందోళన చేయడం అంటే భూ బకాసురులకు వత్తాసు పలికినట్టే అని వ్యాఖ్యానించారు.

ఎంఐఎం కబ్జా దారులను పోగేసి ఆందోళన చేస్తుందని, కాకపోతే పేద ముస్లిములకు మాత్రమే ఆందోళన చేసే హక్కు వాళ్లకు ఉందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం వల్ల ఏమీ నష్టమో చెప్పాలని.. ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరగదని, వక్ఫ్ చట్టం పైన మేము మా మేనిఫెస్టోలో పెట్టే చేశామని తెలిపారు. ఇక్కడ కూడా మైనారిటీ వర్గాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామని, ఈ నెల 17న సన్నాహక సమావేశం ఉందని తెలిపారు. ముస్లిం ప్రార్థన మందిరాలకు వక్ఫ్ బోర్డు కు సంబంధం లేదని, మజీదుల ద్వారా వచ్చే ఆదాయంతో వక్ఫ్ బోర్డు నడవదన్నారు. ఎన్నికలన్నప్పుడు ఓటర్లందరిను కలుస్తాం.. బిఆర్ఎస్, కాంగ్రెస్, ఈ పార్టీ.. ఆ పార్టీ.. అని కాకుండా అందరినీ ఓట్లు అడుగుతామని అన్నారు. ఏ పార్టీ అధికారం లోకి వచ్చిన ఆ పార్టీ పక్కన చేరి ఎంఐఎం ప్రాభల్యం పెంచుకుంటుందని అన్నారు. ఎంఐఎం చిన్నగా న్యూ సిటీ లోకి వచ్చిందని.. ఎర్రగడ్డ, బోరబండ లాంటి చోట్ల ఆ పార్టీ కార్పొరేటర్ లు గెలిచారని అన్నారు. భవిష్యత్ లో హైదరాబాద్ ను కబ్జా చేసే ప్రయత్నం ఆ పార్టీ చేస్తుందని కీలక వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ లకి బిగ్ బాస్ అసదుద్దీన్ ఒవైసీ అని కామెంట్ చేసారు.

# దుబాయ్‌లో దారుణం.. పాకిస్తానీ చెతిలో తెలంగాణకు చెందిన ఇద్దరు హత్య

**దుబాయ్ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

దుబాయ్ నగరంలో జరిగిన ఓ హృదయవిదారక ఘటన కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మత విద్వేషం కారణంగా ఒక పాకిస్తానీ వ్యక్తిచే దారుణంగా హత్య చేయబడ్డారు. ఈ ఘటన దుబాయ్‌లోని ఓ ప్రసిద్ధ బేకరీలో గత శుక్రవారం చోటుచేసుకుంది. ఇక హత్యకు గురైన వ్యాకుతుల వివరాలు చూస్తే..

నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన ప్రేమ్ సాగర్ (40) అనే వ్యక్తి దుబాయ్‌లో గత ఆరు సంవత్సరాలుగా జీవనోపాధి కోసం పనిచేస్తున్నారు. మోడ్రన్ బేకరీ అనే హోటల్‌లో పనిచేస్తున్న ఆయన, ఏడాదిన్నర క్రితం స్వదేశానికి వచ్చిన తరువాత తిరిగి దుబాయ్ వెళ్లారు. అదే బేకరీలో పనిచేస్తున్న పాకిస్తాన్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రేమ్ సాగర్‌పై కత్తితో దాడి చేసి హత్య చేసినట్టు సమాచారం. అతడిని వెనుక నుండి కత్తితో దాడి చేసినట్టు అక్కడి బంధువుల ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది.

అంతేకాకుండా ఈ దాడిలో నిజామాబాద్ జిల్లా వ్యక్తి శ్రీనివాస్ కూడా మృతి చెందాడు. అలాగే మరొక ఇద్దరు తెలుగువారు గాయపడ్డట్టు సమాచారం. మత విద్వేషంతో పాకిస్తానీ వ్యక్తి వీరిపై దాడి చేసినట్టు అర్థమవుతోంది. దాడి అనంతరం పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేయడంతో అక్కడి స్థానికులను, అక్కడ పనిచేస్తున్న భారతీయులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ప్రేమ్ సాగర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషాదకర సమాచారం కుటుంబానికి ఇప్పటివరకు అధికారికంగా తెలియజేయలేదని తెలుస్తోంది. అటు, దుబాయ్ పోలీసులు పూర్తి విచారణ అనంతరం మృతదేహాన్ని స్వదేశానికి పంపిస్తారని సమాచారం.

# కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

**హైదరాబాద్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

కులగణన , బీసీ రిజర్వేషన్ల బిల్లులకు సహకరించిన గవర్నర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు చెప్పారు. మంగళవారం నోవాటెల్‌లో సీఎల్పీ సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గరకు వెళ్ళిందని.. ఇటీవల సుప్రీంకోర్టు కూడా రెండు నెలల్లో విషయాన్ని తేల్చాలని చెప్పింది.. తప్పకుండా సానుకూల తీర్పే వస్తుందని నమ్ముతున్నట్లు మంత్రి తెలిపారు. శాసనసభలో బీసీల రిజర్వేషన్లపై అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయని గుర్తుచేశారు. కులగణన సర్వేను లక్ష మంది ఉద్యోగులతో నిర్వహించామని.. న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా సమాచార సేకరణ జరిగిందని చెప్పారు. ఈ అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. ప్రజలంతా కాంగ్రెస్ చేస్తున్న కార్యక్రమాలపై చర్చించుకునేలా చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే బీసీల రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అన్నారు. రాహుల్ గాంధీ కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారని అన్నారు.

# కేసీఆర్ సూచనతోనే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు

**మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ పార్టీకి, ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజలు మద్దతిచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలని పలువురు కోరుతున్నారంటూ భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వారం నుంచే అధికార దాహంతో కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలో పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని పొంగులేటి తెలిపారు. అర్హులైన అందరికీ సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే జీవోను విడుదల చేశామన్నారు. ''భూభారతి' వచ్చాక కొత్త ప్రభాకర్‌రెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గతంలో అక్రమంగా భూములు కొల్లగొట్టారు. వాటిని భూభారతి ద్వారా ప్రభుత్వం తిరిగి తీసుకుంటుంది. అందుకే ఆయన భయాందోళనకు గురవుతున్నారు. కేసీఆర్ సూచన మేరకే ప్రభాకర్‌రెడ్డి ఆ వ్యాఖ్యలు చేశారు. 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని భారాస నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. భూభారతితో పేదల ఆస్తులను తిరిగి పేదలకు పంచుతాం. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూలుస్తామని పగటి కలలు కంటున్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి కేసీఆర్ ఆత్మ. ఈ ప్రభుత్వంపై మొదటి నుంచి కుట్రలు జరుగుతున్నాయి. వెంటనే సీఎం అయిపోవాలని తండ్రి, కుమారుడు చూస్తున్నారు'' అని పొంగులేటి వ్యాఖ్యానించారు.

**కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు.. కుట్రకోణంగా భావిస్తున్నాం: ఆది శ్రీనివాస్**

భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఖండించారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలనే యత్నాన్ని కుట్రకోణంగా భావిస్తున్నామన్నారు. ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరతామని చెప్పారు. కుట్రకోణం ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

బల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు. అమెరికాకు చెందిన సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సిటిజన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు.

''దిల్లీ, చెన్నైలాంటి మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో 56 శాతం వృద్ధి రేటు ఉంది. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను సంస్థలు లీజుకు తీసుకున్నాయి. ఆమ్జెన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియట్, సిగ్నాలాంటి అంతర్జాతీయ సంస్థలు నగరానికి వచ్చాయి. ఏడాది వ్యవధిలో 70కి పైగా గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌లు ఏర్పాటయ్యాయి. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు'' అని శ్రీధర్‌బాబు అన్నారు.

# "పార్టీ మారే ప్రసక్తే లేదు"

- ఊహగానాలకు బ్రేక్ వేసిన జీవన్ రెడ్డి
- "నా సీనియారిటీకి గౌరవం లేదు, కానీ కాంగ్రెస్‌నే వదలను" – అసంతృప్తి వెలిబుచ్చిన జీవన్
- "చివరి 40 ఏళ్ళుగా నేను అంటే కాంగ్రెస్" – తన పాత్రను గుర్తుచేసిన జీవన్ రెడ్డి

**హైదరాబాద్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ మారుతారన్న ఊహగానాలను కొట్టి పడేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి... వి. హనుమంత్ రావు తర్వాత పార్టీలో నేనే సీనియర్ అని ఆయన తెలిపారు. అంతేకాకుండా... జానా రెడ్డి కూడా నా తర్వాత పార్టీ లో నాలుగు సంవత్సరాల తర్వాత చేరాడని, పార్టీలో భిన్న అభిప్రాయాలు ఉండొచ్చు పార్టీని వీడనని ఆయన తెలిపారు. నేను అసంతృప్తితోనే ఉన్నాను నా సీనియారిటీకి తగిన గౌరవం లభించలేదు కాబట్టి అసంతృప్తితోనే ఉన్నానని, 2014లో మూడు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నేనొక్కడినే శాసనసభ్యుడిని అని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలు కాంగ్రెస్ అంటే నేను.. నేను అంటే కాంగ్రెస్ గా పార్టీ ని బలోపేతం చేశా అని ఆయన వెల్లడించారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ నిరంకుశ ప్రజాస్వామ్య పాలన లో నేను ఎమ్మెల్యేగా,ఎమ్మెల్సీగా ఒంటరిగా పోరాడానని, పార్టీ ఆలోచన మేరకు రెండుసార్లు కేసీఆర్ పై పోటీ చేశానన్నారు. రాజగోపాల్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రావు లు మంత్రి పదవులు ఆశించడం లో తప్పు లేదన్నారు జీవన్ రెడ్డి.

# ఎంపీ చామలకు సీఎం రేవంత్ సీరియస్ వార్నింగ్..

- మంత్రి వర్గ విస్తరణపై సీఎం రేవంత్ కట్టుదిట్టమైన హెచ్చరిక
- నియోజకవర్గ ప్రాజెక్టులకు సీఎం నుంచి పూర్తి మద్దతు హామీ
- పార్టీ విజయంపై రేవంత్ రెడ్డి ఫోకస్ – ఎమ్మెల్యేలకు స్పష్టమైన దిశానిర్దేశం

**హైదరాబాద్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త ట్విస్ట్! ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గా స్పందించారు. ఇటీవల ఎంపీ చామల, రోజుకొకరిని మంత్రిగా ప్రకటిస్తూ వస్తున్న వ్యాఖ్యలు పార్టీకి మంచి పేరు తీసుకురావని సీఎం హెచ్చరించారు. మంత్రి వర్గ విస్తరణ విషయంలో అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని, ఈ అంశంపై ఇకపై ఎవరూ మాట్లాడొద్దని రేవంత్ స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేల సమావేశంలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ లక్ష్యాలను స్పష్టంగా వివరించారు. "మన ప్రధాన లక్ష్యం రెండోసారి అధికారంలోకి రావడం. అందుకు అనుగుణంగా అందరూ పని చేయాలి. నియోజకవర్గాల్లో పట్టు సాధించడమే మన ఫోకస్," అని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలకు సీఎం ఓ కీలక సూచన కూడా చేశారు. "మీ నియోజకవర్గంలో గెలవడానికి కావాల్సిన ప్రాజెక్టులు తెచ్చుకోండి. వాటిని పూర్తి చేయించే బాధ్యత నేను తీసుకుంటా," అని హామీ ఇచ్చారు.

అంతేకాదు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకోవాలని సీఎం సూచించారు. "మీరు పర్యటనలు ముగించాక, నాతో అపాయింట్‌మెంట్ తీసుకుని మాట్లాడొచ్చు. ప్రతి నియోజకవర్గ అవసరాలను పరిశీలిస్తా," అని రేవంత్ అన్నారు.

మంత్రి వర్గ విస్తరణపై అధిష్ఠానం ఇప్పటికే చర్చలు జరిపిందని, ఈ విషయంలో ఎవరూ ఊహాగానాలు చేయొద్దని సీఎం గట్టిగా చెప్పారు. ఎంపీ చామల వంటి నాయకులు ఇలాంటి ప్రకటనలు చేయడం వల్ల పార్టీ ఇమేజ్ డ్యామేజ్ అవుతుందని, ఇకపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో చూపిన నాయకత్వం, పార్టీని గెలిపించడంపై ఫోకస్ చేసిన తీరు ఎమ్మెల్యేల్లో ఉత్సాహాన్ని నింపినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మరోసారి అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే కష్టపడాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ సమావేశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# రాష్ట్ర విపత్తుగా వడదెబ్బ.. మరణిస్తే 4 లక్షల ఎక్స్‌గ్రేషియా..!

**హైదరాబాద్ ఏప్రిల్ 15(ప్రజా-క్షేత్రం):**



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎండలు, వడగాలులు తీవ్రంగా విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతోంది. ఈ క్రమంలో వడదెబ్బ (Heat Stroke) కారణంగా ప్రాణాలు కోల్పోతున్న సంఘటనల నేపథ్యంలో, ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వడదెబ్బను "రాష్ట్ర విపత్తు"గా పరిగణిస్తూ, మరణించిన వారి కుటుంబాలకు రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఇంతకుముందు వడదెబ్బతో మృతి చెందిన వారి కుటుంబాలకు 50 వేల రూపాయల ఎక్స్‌గ్రేషియా మాత్రమే అందించబడుతోంది. అయితే, ఇప్పుడు రాష్ట్ర విపత్తు సహాయ నిధి కింద ఆ మొత్తాన్ని రూ.50 వేలు నుండి రూ.4 లక్షలకి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం.

ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వడగాలుల ప్రభావం నుంచి రక్షించుకోవడానికి స్థానిక అధికారులు జారీ చేసే ఆరోగ్య సూచనలను ఖచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేసింది. ఎండలో ఎక్కువ సమయం గడపకుండా, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. వడదెబ్బ ప్రభావం గురించి ప్రజల్లో అవగాహన పెంచడానికి, సంబంధిత ఆరోగ్య శాఖలు, విపత్తు నిర్వహణ సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నాయి. గ్రామ స్థాయి నుండి నగరాల వరకూ ఈ అవగాహన చర్యలు కొనసాగనున్నాయి. ఈ చర్యల ద్వారా ఎండల కారణంగా ప్రాణ నష్టాన్ని నివారించడమే కాక, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

# జమ్మికుంట లో ఘోర రోడ్డు ప్రమాదం

- డీసీఎం వ్యాన్,బైకు ఢీ
- ఒకరు మృతి

**జమ్మికుంట,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**కరీంనగర్ జిల్లా జమ్మికుంట ఫ్లై ఓవర్ పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎలక్ట్రిక్ బైక్ పై వెళ్తున్న పురం శెట్టి తిరుపతి డీసీఎం వ్యాన్ ను ఓటెక్స్ చేయబోయి అదుపుతప్పి వ్యాను వెనుక టైరు కింద పడడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని డీసీఎంను డ్రైవర్ ని అదుపులోకి తీసుకున్నారు.. ఈ ఘటన జమ్మికుంట ఫ్లైఓవర్పై జరిగింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జమ్మికుంట పట్టణంలోని దుర్గా కాలనీకి చెందిన పురంశెట్టి తిరుపతి గత కొంత కాలం నుండి దుర్గా కాలనీ లో నివాసం ఉంటున్నారు. మృతుడికి భార్య, 7 సంవత్సరాలకు కూతురు, నాలుగు సంవత్సరాల ఒక కుమారుడు అతని తల్లి ఉన్నారు పని నిమిత్తం ఎలక్ట్రానిక్ బైక్ పై వెళ్తుండగా ఫ్లైఓవర్పై ఓ బైకర్ వెళ్తుండగా ప్రమాదవశాత్తు వ్యాను కింద పడడంతో నుజ్జునుజ్జయ్యాడు.



# ఛలో వరంగల్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్ విడుదల

**మొయినాబాద్,ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం):**మండలంలోని యేన్కేపల్లి మున్సిపాలిటీ వార్డు లో గల బిఆర్ఎస్ కార్యాలయంలో బాకారం జాగీర్ మాజీ సర్పంచ్ కొత్తపల్లి రాఘవరెడ్డి,మాజీ ఏఎంసీ డైరెక్టర్ కుమ్మరి రాము, యేన్కేపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు పెండ్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో చలో వరంగల్ వాల్ పోస్టర్ను ఆవిష్కరించడం జరిగింది.ఏప్రిల్ 27వ తారీకు జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రజలందరూ పాల్గొనాలని పేర్కొన్నారు. అలాగే పార్టీ శ్రేణులు కార్యకర్తలు మరియు పార్టీ ప్రతినిధులు నాయకులు అందరూ సమిష్టి కృషితోటి ఈ యొక్క సభను విజయవంతం చేయాలని కొత్తపల్లి రాఘవరెడ్డి ఆకాంక్షించారు.ఈ యొక్క రజతోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బాకారం జాగీర్ మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి,ఏఎంసి డైరెక్టర్ కుమ్మరి రాము, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పెండ్యాల శ్రీనివాస్, బిఆర్ఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి డప్పు కరంచంద్, మొయినాబాద్ మండల యువ నాయకులు అరవింద రజక,మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు కుమ్మరి శ్రీనివాస్,ఉద్యమకారులు ఈదులకంటి రవీందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి,ఎల్గని రమేష్ గౌడ్ న్యాలటీ విగ్నేష్,మధు రజక, దాసరి నరసింహ,బొట్టు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# వడదెబ్బ పట్ల కార్మికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపిన హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి

**జమ్మికుంట,ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం):**జమ్మికుంట పట్టణంలోని ఇటుక బట్టీలలో పనిచేసే వేసవి ఎండల తీవ్రతలకు ఉష్ణ గ్రతలు పెరగటం వల్ల కార్మికులు వడ దెబ్బకు గురయ్యే అవకాశం వుంది కాబ్బటి కార్మికులు అప్రమత్తంగా ఉండాలని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ ఎ మోహన్ రెడ్డి అన్నారు.జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జమ్మికుంట పట్టణంలోని ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులకు వడ దెబ్బ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ అవగహన కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి ఇటుక బట్టి కార్మికులకు వడ దెబ్బ లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమములో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ అరుణ, ఏఎన్ఎం రజిత,హెల్త్ అసిస్టెంట్ నరేందర్,ఆశ రహిమా,సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



# అమ్మ నాన్న అనాథ ఆశ్రమాన్ని సందర్శించిన సినీ హాస్యనటుడు,మాజీ మంత్రి బాబు మోహన్

**చౌటుప్పల్,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్ మండల కేంద్రంలో మంగళవారం రోజున అమ్మ నాన్న అనాథ ఆశ్రమాన్ని మాజీ మంత్రి బాబు మోహన్ సందర్శించారు. మొదట శివాలయం లో ఘనంగా పూజలు నిర్వహించి ఆ తరువాత నూతనంగా నిర్మిస్తున్నటువంటి శివాలయానికి ఇటుక అందజేసి ఆనాథలు ఉన్నటువంటి భవనానికి చేరుకొని అనాథల పలకరింపు చేసి వారిని చూసి చలించిపోయి ఇలా తను కూడా సేవలు ముందు ముందు ఇంకా చేస్తానని చెప్తూ ఆశ్రమం యొక్క పరిసరాలు అన్నీ విక్షించి వారికీ చాలా నచ్చి ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు శంకర్ అభినందించారు. తర్వాత పునర్జన్మ కార్యక్రమం లో భాగంగా ఒక అనాథ కి పూర్తి గా పునర్జన్మ తన చేతుల మీదగా జరిపించారు.తాను ఇలాంటి సేవ చేసే భాగ్యం కల్గినందుకు పూర్వజన్మ సుకృతంగా భవిస్తున్నాను అని తెలియజేశాడు. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ గట్టు శంకర్ వారికీ ధన్యవాదాలు తెలియజేశారు.



# కాంగ్రెస్‌లో కాక రేపిన జానా లేఖ..

## మళ్లీ అటకెక్కిన క్యాబినెట్ విస్తరణ

- జానారెడ్డి షాక్.. విస్తరణకు బ్రేక్!
- ఫలించని అధిష్ఠానం 4+2 ఫార్ములా
- ముసలం పుడుతుందని సంకేతాలు
- గళం విప్పుతున్న ఆశావహ నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ రేపో మాపో అనుకుంటున్న దశలో మరోసారి వాయిదా పడటంతో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఉడుము మూతికి తేనె పూసి కొండలు ఎక్కించినట్టుగా.. 4+2 ఫార్మలా మంత్రివర్గ విస్తరణతో ఔత్సాహికులను ఊరడిద్దామనుకున్న అధిష్ఠానానికి ఆశాభంగమే ఎదురైంది. సీనియర్ నేత జానారెడ్డి అధిష్ఠానానికి లేఖ కారణంగానే విస్తరణ ప్రక్రియకు బ్రేకులు పడినట్టు భావిస్తున్నారు. ఆ లేఖలో ఏం రాశారో కచ్చితంగా బయటకు రాలేదుగానీ, దాని ప్రభావం మాత్రం గట్టిగానే కనిపిస్తున్నది. కసరత్తు లేకుండా కూర్పు జరిగితే ప్రభుత్వ మనుగడ ప్రమాదంలో పడటం ఖాయమని ఆయన హెచ్చరించి ఉంటారని గాంధీభవన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**వేర్వేరుగా జాబితాలు**

మంత్రివర్గంలో ఆరు స్థానాలు ఖాళీ ఉండగా దాదాపు 30మంది ఔత్సాహికులు పోటీపడుతున్న విషయం తెలిసిందే. అధిష్ఠానం దూత మీనాక్షి నటరాజన్ తెలంగాణకు వచ్చి దాదాపు 20రోజులు ఇక్కడే మకాం వేసి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆమె నుంచి అందిన సిగ్నల్ మేరకే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానంతో కూర్పుపై చర్చించి వచ్చారు. ఈ నలుగురిలో ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు కలిసి ఒక జాబితా, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా చెరో జాబితా కాంగ్రెస్ అధిష్ఠానానికి ఇచ్చినట్టు



తెలిసింది.

**జానారెడ్డి లేఖలో ఏముందో..**

నల్లగొండ జిల్లా నుంచి ఒక్క రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వటం వలన ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావుకు, వరంగల్ జిల్లా నుంచి దొంతి మాధవరెడ్డికి, రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డికి చెక్ పెట్టినట్టు అవుతుందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇది నూటికి నూరుపాళ్లు ముఖ్యనేత రాజకీయ వ్యూహమేనని కాంగ్రెస్ పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పార్టీ సీనియర్ నేత జానారెడ్డి రాసిన లేఖ ఆ పార్టీలో కాకరేపుతున్నది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు అసలు మంత్రివర్గంలో ప్రాధాన్యం లేకుండా పోయిందని, ఈ రెండు జిల్లాలు రాష్ట్రంలో ప్రధానమని ఆయన లాజికల్ పాయింట్ లేవనెత్తారట. కానీ ఈ ఒక్క పాయింట్‌తోనే పార్టీలో ఇంత వేడి పుడుతున్నదంటే కాంగ్రెస్ నేతలు ఎవరూ నమ్మటం లేదు. కొత్త మంత్రులను ప్రమాణ స్వీకారానికి పిలుద్దామని డేట్ ఫిక్స్ చేసుకున్న అధిష్ఠానం జానారెడ్డి ఇచ్చిన షాక్‌తో.. విస్తరణకు బ్రేక్ వేసిందంటే లేఖలో ఇంకేదో ప్రస్తావించి ఉంటారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి.

**ఒక్క గొడుగు కిందికి అసంతృప్తవాదులు**

మంత్రి పదవులకు ఆశపడి గోడ దూకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను ఎవరూ పట్టించుకోలేదని, వారి చేత రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు వెళ్లకుండా ఉండటమే వారికి లభించే గొప్ప పదవి అన్నట్టు పరిస్థితి ఉన్నదనే ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో అసంతృప్తివాదులు అంతా ఒక్క చోట కలిస్తే 20 మంది అవుతున్నారని ఢిల్లీ కాంగ్రెస్‌కు నివేదికలు అందినట్టు తెలిసింది. దీనితోపాటు దక్షిణ తెలంగాణకు చెందిన కీలక నేత ఒకరు పార్టీ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఆయనకు అత్యంత ఆప్తునిగా గుర్తింపు ఉన్న ఓ మంత్రిని కూడా తొలగిస్తారనే ప్రచారం నేపథ్యంలో ఆయన ఈ అందరిని ఒక చోటకు తీసుకువచ్చే అవకాశం ఉందని సొంత నిఘా వర్గాలు హెచ్చరించినట్టు తెలిసింది.

మరోవైపు సుదర్శన్‌రెడ్డి పేరు తెరమీదకు రావటంతో నర్సంపేట ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ నేత దొంతి మాధవరెడ్డి ఢిల్లీ వెళ్లారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిశారు. ఇంకోవైపు తన భార్యకు మంత్రి పదవి ఇవ్వకుంటే ఊరుకునేది లేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మెట్టు దిగకుండా గట్టి పట్టుదలతో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో క్యాబినెట్ విస్తరణను వాయిదా వేయడమే మేలు అని అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం.

'మంత్రివర్గంలో నాకు చోటు లేకుంటే.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసినట్టే. ఆదివాసీలకు, పార్టీ కార్యకర్తలకు ఊపిరిగా నిలిచిన నాకే అన్యాయం చేస్తారా? పదేండ్లు పార్టీని కాపాడుకుంటే ఇదేనా మాకిచ్చే గౌరవం. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు కావాలా? అలా ఇస్తానంటే కుదరదు.

# దోషులను వెంటనే గుర్తించి తక్షణమే శిక్షించాలి

### శంఖవరంలో జరిగిన సంఘటను తీవ్రంగా ఖండించిన మురళీరాజు

**ప్రత్తిపాడు,ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం):**శంఖవరంలో భారత రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండలు వేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎంఎంఆర్ ట్రస్ట్ అధినేత,నియోజకవర్గ వైసీపీ నాయకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆయన నివాసం వద్ద స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శంఖవరంలో జరిగిన సంఘటన వంటివి పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్థాయి పోలీస్ అధికారులను నియమించి దోషులు ఎంతటి వాళ్ళయినా కఠినంగా శిక్షించాలని ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

**వికారాబాద్, (ప్రజాక్షేత్రం):** వికారాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లో బాగంగా 300 గృహాలకు మార్కింగ్ చేయగా, అందులో 25 మంది లబ్ది దారులు ఈ రోజు వరకు బెష్ మెంట్ నిర్మాణం చేసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారము శంషాబాద్ నోవాటేల్ హోటల్ నందు ముఖ్య మంత్రి చేతుల మీదుగా ఎంపికైన లబ్ది దారులకు బెష్మేంట్ నిర్మాణానికై ఒక లక్ష రూపాయల చొప్పున ఇద్దరు లబ్ది దారులకు రెండు లక్షల చెక్కులు లు అంధ జేయడం జరిగిందని తెలిపారు. మిగతా లబ్ది దారులకు అందరికి ఆన్లైన్ ద్వార చెల్లింపులు జరుగుతాయని తెలిపారు.





# పాలక ప్రభుత్వాలు ఉపాధి కల్పనలో విఫలం

- ఉపాధి లేక చెడు వ్యసనాలకు బానిసలవుతున్న యువత
- ఆనగంటి వెంకటేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి
- గడ్డం వెంకటేష్ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

**చౌటుప్పల్,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా టాక్స్ గంజాయి ఆన్లైన్ బెట్టింగ్ పై అదేవిధంగా ప్రభుత్వాలు యువతకు ఉపాధి అవకాశాలు నిరుద్యోగాన్ని రూపుమాపాలని ఏడు రోజులపాటు సాగుతున్న డివైఎఫ్ఐ యువ చైతన్య సైకిల్ యాత్ర రెండవ రోజు మంగళవారం పంతంగి గ్రామంలో ప్రారంభించడం జరిగింది. కార్యక్రమానికి డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ పాల్గొని మాట్లాడుతూ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు డ్రగ్స్ గంజాయిని నివారించడంలో,ఆన్లైన్ బెట్టింగులను రద్దు చేయడంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో చిన్న చూపు చూస్తున్నారు అని అప్పుడప్పుడు నివారణ చర్యలు తప్ప దీర్ఘకాలిక చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని వారు అన్నారు.అనేక మంది యువత ఉపాధి అవకాశాలు లేక ఉద్యోగాలు లేక గ్రామాలలో ఆన్లైన్ బెట్టింగులకు డ్రగ్స్ గంజాయికి అలవాటు పడి బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకొని కుటుంబాలకు భారంగా మారుతున్నారని ప్రభుత్వాలు చేయవలసిన పనిని డివైఎఫ్ఐ చేస్తుందని వారు అన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు కూడా గంజాయి డ్రగ్స్ పాకిందని దీనిపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టి దీర్ఘకాలిక నివారణ చర్యలు చేపట్టి డ్రగ్స్ గంజాయిని నిర్మూలన కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.గంజాయి,డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వాలు నిరంతర అవగాహన సదస్సులు దీర్ఘకాలిక కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.అనేక మంది నిరుద్యోగులు గ్రామాలలో ఉపాధి అవకాశాలు లేక ఉంటున్నారని వారికి ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో చెడు అలవాటులకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వారు అన్నారు.జిల్లా వ్యాప్తంగా ఏడు రోజుల పాటు సాగుతున్న యువ చైతన్య సైకిల్ యాత్రకు మద్దతు తెలుపాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కవిడే సురేష్,రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బూరుగు కృష్ణారెడ్డి,జిఎంపిఎస్ జిల్లా నాయకులు కొండే శ్రీశైలం, చింతల సుదర్శన్,చౌటుప్పల మండల అధ్యక్షులు బోదాసు నరేష్,ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తిగుళ్ల శ్రీను,జిల్లా కమిటీ సభ్యులు,దుబ్బాక జగన్,శానగొండ రాము,ఎండి సోహెల్,నత్తి నరేష్,జోకు మహేష్,జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, లక్ష్మీపతి,ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు చింతల మణికంఠ,కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రీషియన్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**బెల్లంపల్లి ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణనికి చెందిన ఎలక్ట్రిషన్ గా పనిచేసే కూడికల శ్రీనివాస్ కొద్దిరోజుల క్రితం చనిపోయారు బెల్లంపల్లి ఎలక్ట్రిషన్ మరియు ప్లంబింగ్, సానిటరీ యూనియన్ తరుపున వారి కుటుంబానికి యూనియన్ అధ్యక్షులు నర్సయ్య, చేతుల మీదుగా 16000/ రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో సిరాజ్, సుదర్శన్, దాము, ప్రణయ్ కుమార్ (బన్ను)మనోహర్ పాల్గొన్నారు.





# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని ధూతూ మంత్రంగా చేసిన మున్సిపల్ కమిషనర్

### బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన బిజెపి నాయకులు

**జమ్మికుంట,ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం):**జమ్మికుంట మున్సిపాలిటీ కమిషనర్ ఆయాజ్, అంబేద్కర్ జయంతి వేడుకలను తూతూ మంత్రంగా నిర్వహించి, అరగంటలో ముగించడం, అక్కడికి బిజెపి పార్టీ నాయకులు రాగానే ప్రోగ్రాం ముగిసింది అని మున్సిపల్ కమిషనర్ వెళ్తుంటే,బిజెపి నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్,బిజెపి పట్టణ మాజీ అధ్యక్షులు జీడి మల్లేష్,ఆకుల రాజేందర్ ప్రశ్నించగా కమిషనర్ ఆయాజ్ మీరు మమ్మల్ని రిక్వెస్ట్ చేసుకోవాలి బై,ఏ ఉకో అంటూ అవమానపరిచే విధంగా మాట్లాడటాన్ని మేము అవమానకరంగా భావిస్తున్నాము అని మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్,జీడి మల్లేష్ అన్నారు, దళిత నాయకులు అంటే మీకు ఎందుకు ఇంత చిన్నచూపు అని,ఇప్పటికైనా మీరు మాట్లాడినా మాటలు రెండు రోజుల్లో వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనియెడల కరీంనగర్ కలెక్టర్ కి,జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ కి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఆయన అధికార పార్టీకి ఒక విధంగా ఇతర పార్టీలను మరోరకంగా చూడటం మానుకోవాలని,మున్సిపల్ ఆఫీస్ లో మొన్న మీరు రెండు మేకలు కోసి విందు ఏర్పాటు చేయడం ఏంటని,ఆ నిధులు ఎక్కడినుంచి ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, పల్లపు రవి,కైలాసకొటి గణేష్, మోతే స్వామి,ఇటుకాల స్వరూప,బల్సుకూరి రాజేష్, రాచపల్లి ప్రశాంత్,కొమ్ము అశోక్,శ్రీవర్తి ప్రవీణ్,ముకుందా సుధాకర్,కురిమిండ్ల అశోక్, కొండపర్తి ప్రవీణ్,పొనగంటి రవి,కనుమల్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్

**శేరిలింగంపల్లి ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**మరో అవినీతి తిమింగలం ఏసీబీ అధికారులకు పట్టుబడింది. ఈసారి జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం మధ్యాహ్నం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు చేపట్టింది. జోనల్ కార్యాలయంలోని అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ గదిలో రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ గత కొంతకాలంగా చాంద్రాయణ గుట్ట సర్కిల్ లో అర్బన్ బయోడైవర్సిటి విభాగం ఇంచార్జ్ గా వ్యవహరిస్తున్నారు. చాంద్రాయణ గుట్ట సర్కిల్ పనికి సంబంధించి ఓ కాంట్రాక్టర్ వద్ద రూ. 70 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడిని లంచం డబ్బులు తీసుకుని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి రావాలని సూచించాడు. దీంతో కాంట్రాక్టర్ అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్



శ్రీనివాస్ తెలిపిన విధంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలోని శ్రీనివాస్ వద్దకు వచ్చాడు. అతని వద్ద నుండి డబ్బులు తీసుకుంటూ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.




## మడిపల్లి గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన దాత అంబాల సుమలత శ్రీనివాస్ దంపతులు

**పాల్గొన్న జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం**

**జమ్మికుంట,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):** జమ్మికుంట మండల పరిధిలోని మడిపల్లి గ్రామంలో అంబాల సుమలత శ్రీనివాస్ దంపతుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం రోజున ముఖ్య అతిథిగా హాజరైన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ బాలవికాస స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమంలో భాగంగా మడిపల్లి గ్రామ ప్రజలతో పాటు ఆ ఊరు మీదిగా వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజల దాహార్తి తీర్చేందుకు బాలవికాస స్వచ్ఛంద సేవ సంస్థ మహిళలు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని,ఇలాంటి సేవ భావాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు.ఈ వేసవి సీజన్ లో గ్రామ గ్రామాన చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం బాలవికాస స్వచ్ఛంద సేవ సంస్థ జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన,జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం తోపాటు చలివేంద్రం ఏర్పాటు చేసిన దాత అంబాల సుమలత లను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు నేరెళ్ల రాజమల్లు గౌడ్,జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గేటి సదానందం,కాంగ్రెస్ పార్టీ మడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పల సాంబశివ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు,కాంగ్రెస్ పార్టీ మడిపల్లి గ్రామ శాఖ ఉపాధ్యక్షులు మంగ అశోక్,తాళ్లపల్లి అంజి, బాల వికాస వికాస స్వచ్ఛంద సేవ సంస్థ కోఆర్డినేటర్స్ అగ్గి స్వాతి,మహమ్మద్ ఆసియా, బాలవికాస మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన బండాగారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్

**షాబాద్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

ప్రాథమిక పాఠశాల మన్మర్రిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134 జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్ మరియు స్థానిక అంబేద్కర్ సంఘ నాయకులు సురేష్, అర్జునయ్య, వెంకటేష్, పాఠశాల లైబ్రరీకి అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధ, ఉపాధ్యాయులు వెంకటమ్మ, మర్పల్లి అశోక్ మరియు అంబేద్కర్ సంఘం నాయకులు అర్జునయ్య, వెంకటేష్, ఆంజనేయులు, రాజ లింగం మాట్లాడుతూ ప్రపంచ మేధావి, విశ్వ రత్న, ఆధునిక భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశ ప్రజల హక్కుల కోసం, అణిచివేతకు గురైన అణగారిన బహుజన వర్గాల చైతన్యం కోసం తన జీవితాన్ని ధారపోసారని, తాను అనుభవించిన వివక్షత మరెవరు అనుభవించకూడదని రాత్రింబవళ్ళు కష్టపడి చదువుకొని ఉన్నత విద్యను అభ్యసించి మన దేశ పరిస్థితులకు అనుకూలమైనటువంటి ఆధునిక భారత రాజ్యాంగాన్ని రూపొందించాలని యావత్ ప్రపంచం మొత్తం అంబేద్కర్ ని కీర్తించే విధంగా తన రచనల ద్వారా ఉద్యమ త్యాగాల ద్వారా సమసమాజ నిర్మాణానికి చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని, విద్యార్థులకు, యువతకు, మహిళలకు, సబ్బండ ప్రజానీకానికి అంబేద్కర్ రూపొందించిన చట్టాలు రక్షణ కవచాలుగా ఉన్నాయని అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అంబేద్కర్ సంఘం నాయకులు బి రామచంద్రయ్య, నిరంజన్, కె రామచంద్రయ్య, అంగన్వాడి టీచర్ సుగుణమ్మ, ఆయా చైతన్య తదితరులు పాల్గొనడం జరిగింది.




## సి హెచ్ సిలో కూలింగ్ వాటర్ మిషన్ ను ప్రారంభించిన వెలుగుల నాని,అంబటి బుజ్జి, గోపిశెట్టి శ్రీను

**ప్రత్తిపాడు,ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం):** కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అభిమానుల సహకారంతో కూలింగ్ వాటర్ మిషన్ ఏర్పాటు చేసారు. ఈ కూలింగ్ వాటర్ మిషన్ ను ఆసుపత్రి వర్కింగ్ కమిటీ చైర్మన్ వెలుగుల నాని,అంబటి బుజ్జి,గోపిశెట్టి శ్రీను చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మైఖేల్ మాట్లాడుతూ సేవా దృక్పథంతో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అభిమానులు చేస్తున్న అభివృద్ధి పనులను కొనియాడారు. ఈ సందర్భంగా వర్కింగ్ కమిటీ చైర్మన్ వెలుగుల నాని మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు,సిబ్బందికి స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలనే సంకల్పంతో ఈ కూలింగ్ వాటర్ మిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనికి సహకరించిన సత్యప్రభ రాజా అభిమానులకు కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది,కూటమి నాయకులు చెలంకూరి భాను,ముత్యాల రాంబాబు,పత్రి రమణ,జెడ్డా రాజేంద్ర,మోర్త లాజర్,చిట్రా రాంబాబు,ముప్పనబోయిన ఏసు,శెట్టిబత్తుల నాని తదితర కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాలలో విఫలం

- కాంగ్రెస్ పార్టీకి రక్షణ కవచం బి.జె.పి
- కాంగ్రెస్ పార్టీనీ నిందిస్తే.... బి.జె.పీకి నొప్పి
- బి.జె.పి,కాంగ్రెస్ పార్టీల చీకటి స్నేహం.
- ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన రేవంత్ రెడ్డి తెలంగాణ ముద్దుబిడ్డానా?
- తెలంగాణ ప్రజలకు అండదండ గులాబీ జెండా.
- రజతోత్సవ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి




**వనపర్తి ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):** ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి రక్షణ కవచంలా బిజెపి నిలిచిందని, కాంగ్రెస్ పార్టీని నిందిస్తే బిజెపికి నిప్పు పోతుందని బిజెపి కాంగ్రెస్ పార్టీల చీకటి కోణం బట్టబయలైందని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఏప్రిల్ 27న వరంగల్ లో జరగబోవు రజతోత్సవ సన్నాహక సమావేశం మంగళవారం గోపాల్ పేట మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షులు బి.బాలరాజు అధ్యక్షతన జరిగింది. ఇట్టి సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ రాష్ట్రనికి అండ కె.సి.ఆర్ గులాబీ జెండా అని బి.జె.పి, కాంగ్రెస్ పార్టీలు చీకటి స్నేహం చేస్తూ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయని అన్నారు. అందుకే తెలంగాణ అస్థిత్వం కాపాడేది కె.సి.ఆర్ అని అన్నారు. పాలమూరు ముద్దుబిడ్డను అని చెప్పుకొనే రేవంత్ రెడ్డి కేవలం 600కోట్లు ఖర్చు పెడితే 12లక్షల ఎకరాలకు సాగు నీళ్ళు ఇవ్వవచ్చని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ ఏర్పాటులో నిబంధనలు పాటించకుండా కాంగ్రెస్ ఆర్భాటం చేస్తుందని విమర్శించారు. మండలంలో మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలంటే ప్రాథమిక నోటిఫికేషన్ ఇస్తారు దాని తరవాత తుది నోటిఫికేషన్ తర్వాత గెజిట్ వస్తుంది ఈ నిబంధనలు పాటించకుండా ప్రజలను మభ్యపెట్టడానికి శంకుస్థాన చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాలలో విఫలమైందని కరెంట్ కోతలు,సాగు నీళ్ళు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులకు రుణమాఫీ లేదని, రైతు భరోసా లేదని, రైతు బీమా లేదని, యువకులకు 2లక్షల ఉద్యోగాలు లేవని, మహిళలకు 2500లేవని, తులం బంగారం లేదని,రైతు కూలీలకు 12000లేవని, రియల్ ఎస్టేట్ కుదేలు అయిందని భూముల ధరలు సగానికి పడిపోయాయని జీవనాధారం కోల్పోయి రియల్టర్స్, మధ్యవర్తులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాలలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కె.సి.ఆర్ రజతోత్సవ సభకు సంకల్పించారని లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచారు. ఈ సమావేశములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, బి.బాలరాజు, మాజీ ఎం.పి.పి సంధ్య తిరుపతయ్య, చంద్రశేఖర్, శేఖర్, తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మతీన్, సయ్యద్. జెమీల్, సునీల్ వాల్మీకి, రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏ.యూ రిజిస్టర్ ఈ.ఎన్ ధనుంజయరావుకి ఏ.ఐ.ఎస్.ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల కరపత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు.

- ఉమ్మడి పీజీ సెట్ ను తక్షణమే రద్దు చేయాలి.
- ప్రైవేట్ పిజి విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలి.

**ఆంధ్ర యూనివర్సిటీ,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):** ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న విద్యా వ్యతిరేక విధానాలు మరియు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 26,27,28 తేదీలలో(మూడు రోజుల) పాటు కడప జిల్లాలో నిర్వహిస్తున్న విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తద్వారా భవిష్యత్తులో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంచి అవగాహన పెంపొందించుకొని ప్రభుత్వాలు సమస్యలు పరిష్కారం చేయడానికి వివిధ రూపాలలో శాంతియుత ఆందోళన కార్యక్రమాలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.అలాగే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉమ్మడి పీజీ సెట్ ను రద్దు చేయాలని అలాగే ఇచ్చిన మాట ప్రకారం ప్రైవేట్ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలన్నారు. యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ,కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టి విద్యార్థులకు చదువు అందుబాటులో ఉంచాలని తెలిపారు.అలాగే పెండింగ్లో ఉన్న ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులను ఆయా కళాశాలలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తక్షణమే ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర యూనివర్సిటీ అధ్యక్షుడు నెహేమియ,కార్యదర్శి జెట్టి. అభిషేక్,ఉపాధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.






## అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కనిపించిన అగ్నిమాపక సిబ్బంది.

**ఏలూరు జిల్లా,ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం ):** అగ్నిమాపక వారోత్సవాల్ల రెండో రోజు భాగంగా 15.04.2025న చింతలపూడి లోని కొత్త బస్టాండ్,పాత బస్టాండ్,శారద థియేటర్ మరియు షాపింగ్ మాల్స్ నందు బ్రోచ ర్లు కరపత్రాలను పంచుతూ ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు.అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు.అగ్నిమాపక గురించి వివరించి వాటిని ఉపయోగించే విధానమును తెలియజేశారు.వేసవికాలంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు ఒకవేళ అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిని ఏ విధంగా ఆర్పాలి అని ప్రజలకు డెమో ద్వారా తెలిపారు. థియేటర్ల వద్ద గల ఫైర్ టూల్స్ యొక్క విషయాలు గురించి అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించారు అలాగే ఇళ్ల వద్ద లేదా పాకలలో గుడిసెలలో గ్యాస్ లీక్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు.ఈ కార్యక్రమంలో ఫైర్ అధికార కే వేంకట రెడ్డి,ఎల్ ఎఫ్ రామకృష్ణ,సిబ్బంది బి రవి కుమార్,బీ. అది శేషు,టీ. కోటేశ్వరరావు,అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నూతన బిజెపి ఎమ్మెల్సీలకు ఘనంగా ఆత్మీయ సన్మానం కార్యక్రమం..!

**సుల్తానాబాద్ ఏప్రిల్ 15,(ప్రజాక్షేత్రం):**

సుల్తానాబాద్ మండల కేంద్రంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్ లో ఇటీవల భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీగా గెలుపొందిన చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్యలకు ఆత్మీయ సన్మాన అభినందన కార్యక్రమం జిల్లా బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పెద్దపల్లి బిజెపి జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవ రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కష్టపడ్డ పార్టీ నాయకులు, ప్రతి కార్యకర్తకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రతి కార్యకర్త హిందూ భావజాలంతో ముందుకు పోవాలని, బీజేపీ విజయానికి కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో పాలకుడు మారాడు కాని, పాలన తీరు అలాగే ఉందని, ధరణి పేరుతో గతంలో జరిగిన భూ అక్రమాలకు బాదితుల పక్షాన నిలిచిన కాంగ్రెస్ కు ప్రజలు అధికారాన్ని అంటగట్టారని అన్నారు. ఇప్పుడు భూభారతి పేరుతో అదే దారిలో కాంగ్రెస్ కొనసాగుతుందని, భూసమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి స్పష్టమైన లక్ష్య దిశ లేదని ఆందోళన వ్యక్తం చేశారు.మంత్రి పదవుల కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బజారున పడుతున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని,తాగునీటి సమస్యలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలు, అకాల వర్షాల వల్ల పంట నష్టాల సమస్యలు పట్టింపు సరిగా లేదు గాని, కాంగ్రెస్ నాయకులు పదవుల కోసం పోటీ పడుతుండటం దుర దృష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణా రెడ్డి, కాశీపేట లింగయ్య, గోమాసా శ్రీనివాస్,మాజీ జిల్లా అధ్యక్షులు అర్జున్ రావు, గొట్టేముక్కుల సురేష్ రెడ్డి,కందుల సంధ్యారాణి,గుర్రాల మల్లేశం, కూకట్ల నాగరాజు, కడారి అశోక్ రావు, మహేందర్ మరియు బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి గింజ కొనుగోలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

- టీజీఐఐసి చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి.
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్.

**కొండాపూర్,ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం):** ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను పొందాలని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి అన్నారు. మంగళవారం కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్,తొగర్ పల్లి ల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను టీజీ ఐ ఐ సి చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి,సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ లు ప్రారంభించారు.ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్మన్ నిర్మల రెడ్డి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తో కలిసి మాట్లాడుతూ 17 శాతం తాలు తేమ లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు.ప్రభుత్వం గ్రేట్ సన్ క్వింటాల్ కు రూ.2,320, కామన్ గ్రేడ్ ధర క్వింటాలకు రూ.2,300 పొందాలని సూచించారు.ప్రభుత్వం సన్నా ప్రభుత్వం సన్న రకం వరికి ధాన్యానికి రూ.500 బోనస్ ను కల్పించిందన్నారు.రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొంది ఆర్థికంగా లాభ పడాలని సూచించారు.తరుగు లేకుండా రైతులకు మోసం చేయకుండా ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేస్తున్న అని రైతులను కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు గురి చేయకుండా ధాన్యాన్ని సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వై ప్రభు,సొసైటీ చైర్మన్ లు పవన్ కుమార్,రాజు తహసిల్దార్ అశోక్,ఎంపీడీవో శ్రీనివాస్,ఏవో గణేష్,సిడిసి చైర్మన్ గడీల రామ్ రెడ్డి , కాంగ్రెస్ నాయకు కాంగ్రెస్ నాయకులు ఎల్ .శ్రీకాంత్ రెడ్డి, నరసింహారెడ్డి,శ్రీనివాస్ గౌడ్ , బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు విఠల్,టిఆర్ఎస్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి మల్లేశం, రాంచంద్రయ్య,ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.



## వేములపల్లి క్రికెట్ టోర్నమెంట్లో ఎస్ఆర్కె టీం విజయా దుందుభి.



**లింగపాలెం,ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం ):** ఏలూరు జిల్లా, మండల పరిధిలోని వేములపల్లి లో జరిగిన క్రికెట్ టోర్నమెంట్లో ఎస్ ఆర్ కె టీం చింతలపూడి శాసనసభ్యులు రోషన్ కుమార్ వర్సెస్ టీం ఆడమిల్లి తలపడగా టాస్ గెలిచి టీం ఎస్ ఆర్ కె బ్యాటింగ్ ఎంచుకుని 12 అవర్లకు 134 రన్స్ చేయగా టీఅడమల్లి 12 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసి ఊడిపోవడం జరిగింది.67 పరుగుల తేడాతో భారీ యోజన దిశగా టీం ఎస్ ఆర్ కే దూసుకుపోయింది. గెలిచిన ఎస్ ఆర్ కె టీమును శాసనసభ్యులు రోషన్ కుమార్ అభినందనలు తెలియజేశారు టీం ఆడమిల్లి కి ఆల్ ది బెస్ట్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గరిమళ్ల, చలపతిరావు,పాతూరి మురళి,నత్త నాగేంద్ర,గంట సుధీర్ బాబు,గారపాటి నాగ బుద్ధ వరప్రసాద్,బొల్లినేని శ్రీను,బొల్లిన పుల్లారావు, పాతూరి ప్రభాకర్,చిదరాల మధుబాబు,కోటగిరి, నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# టోల్ సిబ్బందిపై దాడి

**రాజేంద్రనగర్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సమీపంలోని టోల్ సిబ్బందిపై దాడి జరిగింది. రాజేంద్రనగర్ ఎగ్జిట్ 17 వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. టోల్ సిబ్బంది డబ్బులు అడిగినందుకు.. జూనియర్ అసిస్టెంట్ హుస్సేన్ సిద్ధికి, అతని కుటుంబ సభ్యులు వారిపై దాడికి పాల్పడ్డారు. తన కారుకు టోల్ మినహాయింపు ఇవ్వాలని హుస్సేన్ సిద్ధికి టోల్ సిబ్బందిని కోరాడు. అయితే ఆ కారుకు టోల్ మినహాయింపు లేకపోవడంతో డబ్బులు చెల్లించాలని టోల్ సిబ్బంది తెలిపారు. దీంతో హుస్సేన్ సిద్ధి ఒక్కసారిగా కోపంతో ఊగిపోయాడు. వాహనం ఆపినందుకు టోల్ సిబ్బందిపై ఆగ్రహంతో దాడి చేశాడు. గోడవను అడ్డుకోబోయిన ఇతర టోల్ సిబ్బందిపై సైతం దాడికి పాల్పడ్డారు. ఈ దాడిపై హుస్సేన్ సిద్ధికితో పాటూ అతని కుటుంబ సభ్యులపైనా పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుస్సేన్ సిద్ధికి.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్

**ఏలూరు జిల్లా,ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం):** చింతలపూడి లోని వికేయం ఫంక్షన్ హాల్ నందు గ్రామ రెవెన్యూ అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులతో గ్రామభివృద్ధి పై సమీక్షా సమావేశం నిర్వహించిన శాసన సభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్.నాలుగు మండలాల అభివృద్ధి పై సమీక్ష జరిపారు,పంచాయతీ కార్యదర్శులతో గ్రామాలలో పరిస్థితులు, పేరుకుపోయిన చెత్త ను ఎప్పటికప్పుడు క్లీన్ చేయాలని,నీటి ఎద్దడి రాకుండా చూడాలని, అందరూ కూడా స్థానికంగా ఉన్న కూటమి నాయకులతో కలిసి పనిచేయాలని, నేను బస్ లో కానీ ఆటో లో కానీ ప్రయాణం చేసినప్పుడు ఎవరైనా వారికి ఏ సమాచారం తెలీదం లేదు అన్న,మా సమస్య ను పట్టించుకోవడం లేదు అన్నా దానికి మీరే సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంటుంది అని, ఎప్పుడూ సమీక్షా సమావేశం జరిగిన పూర్తి సమాచారం తో రావాలని, పనిలో అలసత్వం చూపొద్దని చాలా గట్టిగా చెప్పారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల అద్యక్షులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# అందరి కోరిక అదే.. కాంగ్రెస్ అధిష్టానానికి తలనొప్పిగా అంతర్గత కుమ్ములాటలు

**తెలంగాణ బ్యూరో ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం ):** తెలంగాణ కాంగ్రెస్‌లో కొన్ని రోజులుగా ఏమి జరుగుతుందో ఎవరికీ అర్థం కావడంలేదు. పార్టీ నేతలు ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో బహిరంగ విమర్శలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువంటూ ఇలాంటి అంతర్గత కుమ్ములాటలను ఆ పార్టీ సమర్థించుకోవడం సహజమే. కానీ పార్టీలో కొత్తగా చేరిన నేతలో, క్షేత్రస్థాయి నాయకులో ఈ విమర్శలు చేయడంలేదు. ఎమ్మెల్యేలు, ఆ స్థాయి నేతలే ఇలాంటి విమర్శలు చేసుకోవడంతో నేరుగా సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. పార్టీకి ఇబ్బంది కలిగించేలా ఏ నాయకుడు మాట్లాడినా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ముఖ్యంగా మంత్రి పదవులు ఆశిస్తున్న నాయకులు తమ పోస్టులను వేరే ఒకరు ఎగరేసుకుపోతున్నారనే ప్రచారం నేపథ్యంలో సొంత పార్టీ నేతలపై కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. తాజాగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జానారెడ్డిని ఉద్దేశించి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి.

**అందరి కోరిక అదే**

తెలంగాణలో పూర్తిస్థాయిలో మంత్రివర్గం కొలువు దీరలేదు. ముఖ్యమంత్రితో కలిపి మొత్తం 18 మంది వరకు మంత్రివర్గంలో ఉండొచ్చు. ప్రస్తుతం సీఎంతో కలిపి 12మంది మాత్రమే ఉన్నారు. ఇంకా ఆరుగురికి మంత్రిమండలిలో చోటు కల్పించే అవకాశం ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఆరుగురు మంత్రుల ఎంపిక పూర్తికాలేదు. తాజాగా తెలంగాణలోని మంత్రిమండలిలో ఖాళీలను నింపుతారంటూ ప్రచారం జరుగుతోంది. ఉగాదిగే ఈ ప్రక్రియ పూర్తవుతుందని అంతా



భావించారు. కానీ అంతర్గత కుమ్ములాటల నేపథ్యంలో ఈ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. మంత్రి పదవుల కోసం ఎక్కువ మంది ఆశావాహులు ఉండటంతో ఎవరికి ఇస్తే ఎలాంటి ఇబ్బదులు వస్తాయోననే ఆలోచలో హైకమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది.


**సామాజిక సమీకరణల నేపథ్యంలో**

సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణలో మంత్రివర్గాన్ని నింపాల్సి ఉంటుంది. బీసీ నినాదం పెద్దఎత్తున నడుస్తున్న క్రమంలో వారికి కనీసం 2 సీట్లు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఎస్సీలకు రెడు, మైనార్టీలకు మరొక పదవి ఇవ్వాల్సి ఉంది. కానీ కాంగ్రెస్‌లో ఓసీ అభ్యర్థుల నుంచి మంత్రి పదవుల కోసం తీవ్రపోటీ నెలకొంది. ఈ క్రమంలో ఆ ఒక్క పదవి కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా కష్టడుతున్నారు. ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిని ఆశిస్తున్నారు. కానీ ఒకే కుటుంబంలో రెండు పదవులు వద్దని కొందరు నేతలు హైకమాండ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన వారికి మంత్రి పదవి ఇవ్వాలని మాజీ మంత్రి జానారెడ్డి కాంగ్రెస్ అధిష్టానానికి లేఖ రాశారు. దీంతో తన పదవికి జానారెడ్డి అడ్డుపడుతున్నారనే ఉద్దేశంతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా కొన్ని విమర్శలు చేశారు. ఇలా మంత్రి పదవులు ఆశిస్తున్న నేతలు సొంతపార్టీ నాయకులపై బహిరంగంగా విమర్శలు చేసుకుంటుండటం అధిష్టానానికి తలనొప్పిగా మారిందట.

# పాదయాత్రను ప్రారంభించిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి

**వలిగొండ,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

బిఆర్ఎస్ పార్టీ 25వ వసంతములో అడుగుపెడుతున్న తరణములో ఈ నెల 27 వ తేదిన వరంగల్ లో తలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ,బి ఆర్ఎస్ పార్టీ విద్యార్థి యువజన విభాగం ఆధ్వర్యంలో మత్స్యగిరి గుట్ట నుండి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పాదాల వరకు, తలపెట్టిన పాదయాత్రను మాజీ మంత్రి సూర్యపేట ఎమ్మెల్యే జగదీశ్వర్రెడ్డి మంగళవారం రోజున జెండా ఊపి ప్రారంభించారు.



ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ క్యామ మల్లేష్, బోనగిరి మాజీ ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి,గాదరి కిషోర్,కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి,బూడిద బిక్షమయ్యగౌడ్, డిసిసిబి మాజీ చైర్మన్ గొంగడి మహేందర్రెడ్డి,రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, వలిగొండ మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి మొగిలి శ్రీనివాస్, నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ కు కేబినెట్ ఆమోదం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం
- పలు కీలక అంశాలపై చర్చ
- ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్ కు పచ్చజెండా
- మీడియాకు వివరాలు తెలిపిన మంత్రులు



**అమరావతి ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం ):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రిమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో పాటు రాజధాని అమరావతిలో కీలక నిర్మాణాలకు నిధులు, ఐటీ అభివృద్ధికి భూ కేటాయింపులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై కూడా మంత్రిమండలి నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడు, అనిత మీడియాకు వివరాలు తెలిపారు.

**ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ కు పచ్చజెండా**

షెడ్యూల్డ్ కులాల్లోని 59 ఉపకులాల మధ్య సామాజిక అంతరాలు, వెనుకబాటుతనం ఆధారంగా వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి గతంలో నియమించిన జస్టిస్ రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య కమిషన్ నివేదిక, సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకుని, జాతీయ ఎస్సీ కమిషన్ సూచనల మేరకు ముసాయిదా ఆర్డినెన్స్‌ను సిద్ధం చేశారు. దీనికి కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

ఈ వర్గీకరణ ప్రకారం 59 ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించినట్లు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. గ్రూప్ 1లోని 12 ఉపకులాలకు 1 శాతం, గ్రూప్2లోని 18 ఉపకులాలకు 6.5 శాతం, గ్రూప్3లోని 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయనున్నట్లు ఆయన వివరించారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఫలాలు అన్ని ఉపకులాలకు సమానంగా అందేలా 200 పాయింట్ల రోస్టర్ విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. "ఎస్సీ ఉపకులాల ఏకీకృత, సమానమైన పురోగతి కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం. దీని ద్వారా రాజ్యాంగ లక్ష్యాలను సాధించగలమని భావిస్తున్నాం" అని మంత్రి డోలా తెలిపారు.

**రాజధాని నిర్మాణం, సీఆర్డీఏ నిర్ణయాలు**

అమరావతిలో పరిపాలన భవనాల నిర్మాణానికి సంబంధించి కూడా కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. నూతన అసెంబ్లీ భవన నిర్మాణానికి రూ. 617 కోట్లు, హైకోర్టు భవన నిర్మాణానికి రూ. 786 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. టెండర్లలో ఎల్ 1 బిడ్డర్‌లకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ (ఎల్ఓఏ) అందజేసే అధికారాన్ని సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సీఆర్డీఏ 46వ అథారిటీ తీసుకున్న నిర్ణయాలకు కూడా కేబినెట్ ఆమోదం లభించింది.

**ఐటీ, సంక్షేమ రంగాలపై దృష్టి**

రాష్ట్రంలో ఐటీ రంగాన్ని బలోపేతం చేసే దిశగా విశాఖపట్నంలో ఐటీ హిల్3 వద్ద ప్రముఖ సంస్థ టీసీఎస్‌కు 21.66 ఎకరాలు, ఉరుస క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 3.5 ఎకరాలు కేటాయించాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే కాపులుప్పాడలో ఉరుస క్లస్టర్స్‌కు మరో 56 ఎకరాలు కేటాయించారు. సంక్షేమ పథకాల అమలుపైనా కేబినెట్ దృష్టి సారించింది. ఈ నెల 26న మత్స్యకార భరోసా పథకం కింద అర్హులైన మత్స్యకారులకు రూ. 20,000 చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించినట్లు హోంమంత్రి అనిత తెలిపారు.

**ఇతర కీలక నిర్ణయాలు**

వీటితో పాటు, బలిమెల, జోలాపుట్ రిజర్వాయర్లపై 30 మెగావాట్ల సామర్థ్యంతో రెండు హైడల్ ప్రాజెక్టుల నిర్మాణానికి, పవన, సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి, వచ్చే విద్యా సంవత్సరంలోగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. గుంటూరులో ఈఎస్ఐ ఆస్పత్రికి ఉచితంగా భూమి కేటాయించాలని, గ్రేహౌండ్స్ విభాగానికి కొత్తవలసలో భూమి ఇవ్వాలని, రాష్ట్రంలో భూగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా మంత్రిమండలి నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు.

# అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులుప్రారంభించాలి :గ్రామీణ పేదల సంఘం

**చివ్వేంల,ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం):** మండల కేంద్రంలోని ఎంపీడీవో కి, గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కొనకంచి వీరభద్రయ్య, భాషిపంగు సునీల్, మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ కూలీల కుటుంబానికి 150రోజులు పని దినాలు కల్పించాలని,కొన్ని గ్రామాలలో ఇప్పటివరకు పని కల్పించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని కల్పించిన గ్రామాలలో ఒక వారం ఒక గ్రూపుకి ఒక వారం మరొక గ్రూపుకి అవకాశం కల్పిస్తున్నారు. దాని వలన కూలీలు సగం రోజులు పనిచేసే మిగిలిన సగం రోజులో నష్టపోతున్నారు అదేవిధంగా కూలీలకు ప్రస్తుతం నిత్యవసర ధరల సూచిక ఆధారం ప్రకారం ప్రతికూలికి 350/ రూపాయల చొప్పున వేతనం కల్పించాలి అదేవిధంగా వారం వారం ప్రతికూలికి ప్లేస్ స్లిప్ అందించి, వారి డబ్బులను అకౌంట్లో జమ చేయాలి ఈ సంవత్సరం మార్చి మాసం నుండి ఇప్పటి వరకు పని చేసిన కూలీలకు డబ్బులు రాలేదని దాంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.పని ప్రదేశంలో ప్రాథమిక వైద్య సదుపాయం మరియు టెంటు మరియు మంచినీరు సదుపాయం కల్పించాలి, వేసవి తీవ్రతకు కూలీలు ఇబ్బందులు పడకుండా ఉదయం 10 గంటల వరకే పని చేయించాలి.వడదెబ్బకు ప్రమాదం జరిగిన కూలీలకు ప్రభుత్వమే బాధ్యత వహించి బీమా సదుపాయం కల్పించాలి.ఉపాధి కూలీలకు పనిముట్లను ప్రభుత్వం అందించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం జిల్లా నాయకులు అనంతుల ఎల్లయ్య,వెంకన్న, బాబు,రమేష్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు రూ. 20.19 కోట్లు విడుదల:మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం,ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం):**

బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ.20.19 కోట్ల రూపాయిలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.మొదటి విడతలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్ మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి లక్ష రూపాయిల చొప్పున రూ. 20.19 కోట్ల రూపాయిలను విడుదల చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నాకూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు. ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , గ్రౌండింగ్ అయిన ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని ఇప్పటికి 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు 12 మంది లబ్దిదారులకు మంగళవారం నాడు లాంఛనంగా లక్ష రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమచేస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తైన వెంటనే బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షల రూపాయిలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామని వివరించారు. బేస్‌మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు. కనీసం 400 ఎస్ ఎఫ్ టి కి తగ్గకుండా 600 ఎస్ ఎఫ్‌టీకి మించకుండా లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు.అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడం, అధికారులకు , ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.




# ఇంగ్లీష్ టీచర్ వేధిస్తోంది.. మండుటెండలో కేజీబీవీ విద్యార్థినుల ధర్నా

**నాగర్‌కర్నూల్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):** నాగర్ కర్నూల్ జిల్లా నాగనూలులో పది రోజుల క్రితం ఇంగ్లీష్ టీచర్ కళ్యాణి వేధింపులు భరించలేక 9వ తరగతి విద్యార్థిని తన చేయి కోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. పది రోజులైనా టీచర్‌పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇంగ్లీష్ టీచర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల తీరును నిరసిస్తూ.. విద్యార్థినులు మరోసారి మండుటెండలో ధర్నా చేశారు. మేడమ్ మమ్మల్ని టార్చర్ చేస్తుంది, స్నానం చేస్తుంటే ఫోటోలు తీసి ఎవరెవరికో పెడుతుంది, చదవకపోతే గొంతు పట్టుకొని పైకి లేపుతుంది అంటూ విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు మూడు గంటల నుంచి విద్యార్థినులు తరగతులను బహిష్కరించారు. ఇంగ్లీష్ టీచర్ కళ్యాణినీ సస్పెండ్ చేసే వరకు తాము ఎట్టి పరిస్థితుల్లో క్లాసుల్లోకి వెళ్ళమని, భోజనం ముట్టుకోమని విద్యార్థినులు తేల్చిచెప్పారు.



# రాజీవ్ యువ వికాస్ పథకం గడువు పెంచినట్టా.. లేనట్టా

**ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ**

**శంకర్‌పల్లి ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం ):** శంకర్ పల్లి మండల కేంద్రము విలేకరుల సమావేశంలో కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు ఆర్థిక సహాయం అందించేందుకు తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాస్ పథకం ఆన్లైన్ దరఖాస్తుల గడువు సోమవారంతో ముగుస్తుండగా మరోసారి పొడిగిస్తున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరిగిందని అన్నారు. కానీ తీరా దరఖాస్తు చేసుకుందామని సంబంధించిన వెబ్సైట్ ఓపెన్ చేయడంతో దరఖాస్తు గడువు 14వ తేదీతో ముగిసిందని, వెబ్సైట్ క్లోజ్ చేశామనే సమాచారంతో నిరుద్యోగుల్లో గందరగోళం ఏర్పడిందని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులైన ఐదు లక్షల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవడంలోని పలుసమస్యలను గుర్తించిన ప్రభుత్వం తొలుత ఈనెల 14 వరకు గడువు పొడిగించినప్పటికీ చివరి మూడు రోజుల నుండి సర్వర్ ప్రాబ్లంతో అనేక మంది నిరుద్యోగులు దరఖాస్తూ చేసుకోలేకపోయారు. దీంతో మరోసారి ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో నిరుద్యోగులు సంతోషించారు. దరఖాస్తు గడువును పెంచాలని అన్నారు. కానీ దరఖాస్తు చేసుకోవడానికి మీ సేవకి వెళ్లి ప్రయత్నించగా సంబంధిత వెబ్సైట్ లో మాత్రం దరఖాస్తు గడువు ముగిసిందని ఉండడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.



# బిఆర్ఎస్వి పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించిన శివరాత్రి విద్యాసాగర్

**నారాయణపురం,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం ):** ఏప్రిల్ 27 వ తేది వరంగల్ లో జరిగే టిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ భారీ బహిరంగ సభ విజయవంతం కావాలని యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో వేములవాడ లక్ష్మీనరసింహ ఆలయ నుండి యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు చేపట్టిన పాదయాత్రకు నారాయణపురం మండలం గుడిమల్కాపురం గ్రామం నుండి బయలుదేరిన బిఆర్ఎస్వి పాదయాత్రను బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు శివరాత్రి విద్యాసాగర్ మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ చైర్మన్ గడ్డం మురలీధర్ రెడ్డి, నాయకులు మన్నె చిత్రసేనారెడ్డి ,సిద్ధ గౌని శ్రీను, బోయ శ్రీరామ్,నలప రాజు రమేష్,మహేందర్,ఫర్హాన్, పగిళ్ల శ్రీకాంత్,తరుణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## పాండ్య నాయక్ తండాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సూర్యాపేట వ్యవసాయం మార్కెట్ డైరెక్టర్

**చివ్వేంల,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం లో రైతులు ధాన్యాన్ని విక్రయించాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దారావత్ వీరన్న నాయక్ అన్నారు. మంగళవారం మండలం లోని పాండ్య నాయక్ తండాలో ఏర్పాటుచేసిన ఐకెపి సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని,దళారులను నమ్మి రైతులు మోస పోవద్దని అన్నారు.సెంటర్ నిర్వాహకులు రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు,ఏపీఎం సైదయ్య,నాయకులు బిక్షం నాయక్,సమీర్,లాలు, హనుమా,సోమాని,మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ఇచ్చిన హామీలు నెరవేస్తున్న ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్,ఎస్సి సెల్ అద్యక్షులు బొడ్డు బొందయ్య



**ఖమ్మం,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని,అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలనేవి ప్రభుత్వ సంకల్పమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క హామీను నెరవేరుస్తూ కాంగ్రెస్ అంటేనే ప్రజా ప్రభుత్వం అని నిరూపిస్తున్న ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుకు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర మంత్రి మండలి సభ్యులు అందరికి ఖమ్మం కాంగ్రెస్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ,వారి చిత్ర పటాలకు పాలాభిషేకంచేసి,మిఠాయిలు పంచి బాణాసంచా కాల్చి సంబురాలు నిర్వహించినారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మరియు జిల్లా SC సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య లు మాట్లాడుతూ ఎన్నోసంవత్సరాలుగా పేరుకుపోయిన ఎసీ వర్గీకరణ మరియు ధరణి సమస్యలను కాంగ్రెస్ చేవెళ్ల డిక్లరేషన్ లో ఇచ్చిన మాట ప్రకారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి రోజున జీఓ విడుదల చేసి మాదిగ, మాదిగ ఉప కులాలకు,రైతులకు న్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ అని అన్నారు,ఉచిత బస్సు ప్రయాణం నుండి సాగుతున్న పాలన రిజర్వేషన్ల అమలు వరకు వచ్చామని ఆర్థిక పరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ వాటిని అధిగమిస్తూ అభివృద్ధి మరియు సంక్షేమాన్ని బ్యాలెన్స్ చేస్తూ ప్రజా మన్ననలను పొందుతున్నామని చెప్పడానికి చాలా గర్వంగా ఉందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా మూడు దశాబ్దాల పోరాట ఆకాంక్షలను నెరవేర్చి విద్యా, ఉద్యోగ, స్థానిక రాజకీయాల్లో బడుగు బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు చట్టరూపం ఇవ్వడం జరిగిందని,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ద్వారా పేదబిడ్డలకు నాణ్యమైన విద్య అందించాలని సంకల్పిస్తున్నామని అన్నారు. రైతుకు, రైతు కూలీలకు ఇందిరమ్మ భరోసాగా ఎకరాకు, ఏడాదికి రూ.12 వేల ఆర్థిక భరోసా ఇస్తున్నామని పేదవాడి ఆకలి తీర్చడమే కాదనీ.ఆరోగ్యం,ఆత్మగౌరవం కాపాడాలని సన్నబియ్యం పథకానికి శ్రీకారం చుట్టడ జరిగిందని తెలిపారు. పేదల ఆత్మగౌరవ ప్రతీకగా "ఇందిరమ్మ ఇళ్ల" పథకాన్ని ప్రారంభించామని, రైతు, పేద భూమికి హక్కు పై భరోసా ఇస్తూ... "భూ భారతి" కి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ఇవ్వన్నీ చూసి ఓర్వలేక బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ పై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బతకడమే కాంగ్రెస్ ప్రభుత్వ నిజమైన ఎజెండా అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సేవాదళ్ కో ఆర్డినేటర్ చోటా బాబా,టీపీసీసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం,జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు,దొబ్బల సౌజన్య ,సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,మొక్కా శేఖర్ గౌడ్, జిల్లా ఆర్ టీఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,జిల్లా కాంగ్రెస్ నాయకులు రషీద్, ముక్రం,జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్ కార్పొరేటర్లు లకావత్ సైదులు నాయక్,రాపర్తి శరత్,కన్నం వైష్ణవిప్రసన్నకృష్ణ,చామకూరి వెంకటనారాయణ,ముక్తార్ జోహార,జిల్లా ఎసీ సెల్ ఉపాధ్యక్షులు రాకేష్,నగర కాంగ్రెస్ నాయకులు గద్దం వెంకటయ్య,బీరెడ్డి రమేష్,వాసిం,జెర్రిపోతుల అంజనీకుమార్,బచ్చలకూరి నాగరాజు,బోయిన వేణు, జహీర్ భాయ్,శ్రీశైలం,సాదే శంకర్,పాషా,ఆదర్శ నాయుడు,మధు,పర్వత శ్రీనివాస్,ఉరుకొండ చంద్రిక, భవాని,లక్ష్మి రమాదేవి, సుకన్య,సమీరా,నసీమా, మరియు జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన మండల ఎస్సి సెల్ అద్యక్షులు తదితర నాయకులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి:సి ఐ టి యూ

**వలిగొండ,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేసి కార్మికులని ఆదుకోవాలని సిఐటి యు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వలిగొండ దేవిశ్రీ ఫంక్షన్ హాల్ లో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ వలిగొండ మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షుడు కొండ నరసింహ అధ్యక్షతన నిర్వహించగా,ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ మల్టీ పర్పస్ కార్మికులు కాకుండా ఇతర కార్మికులకు గత తొమ్మిది నెలల నుండి వేతనాలు రాక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, పంచాయతీ కార్యదర్శులు కార్మికుల వేతనాలు చెక్కులు కొట్టి ట్రెజర్లు వేసిన చెక్కులు డ్రా కాక ఇబ్బంది పడుతున్నారని వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం రాక ముందుకు గ్రామపంచాయతీ కార్మికులని ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే పద్ధతిలో ఒకటవ తేదీనే బ్యాంకు ద్వారా వేతనాలు ఇస్తానమ ని చెప్పి మాట మార్చిందని,పి ఆర్ సి అమలు చేస్తానని మోసంచేసింది అని విమర్శించారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎంపీడీవో కు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు,ఎడవెల్లి ఎల్లమయ్య,రాములు మధు, రాజు,లింగస్వామి,మూర్తి, సాయిలు,శీను,సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటిని అక్రమంగా దారి మళ్లిస్తున్న వినియోగదారులు

- 25 మోటార్లు సీజ్ చేసిన జలమండలి
- ప్రజలెవరూ నీటి దుర్వినియోగానికి పాల్పడ్డవద్దని విజ్ఞప్తి

**హైదరాబాద్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):** గ్రేటర్ హైదరాబాద్‌లో తాగునీటిని అక్రమంగా దారి మళ్లిస్తున్న వినియోగదారులపై జలమండలి కొరఢా ఝులిపిస్తోంది. మోటార్ ఫ్రీ టాప్ వాటర్ పేరుతో నేటి నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 50 బృందాలు రంగంలోకి దిగి నల్లాలకు అక్రమంగా బిగించిన మోటార్లను స్వాధీనం చేసుకున్నాయి. అక్కడిక్కడే యజమానులకు జరిమానాలు విధించడంతో పాటు మరోసారి మోటారు బిగిస్తే కనెక్షన్ కట్ చేయనున్నట్లు హెచ్చరిస్తున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో తాగునీటిని సరఫరా చేస్తుంటే కొంతమంది దురాశతో చివరి వినియోగదారుడికి వెళ్లాల్లిన నీటిని అడ్డుకుంటున్నారని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మండిపడ్డారు. ఎండీ నుంచి లైన్ మెన్ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ తనిఖీలు చేస్తున్నామన్నారు. నల్లాల లోప్రెషర్‌కు లైన్ మెన్లనే బాధ్యులను చేసినట్లు ఎండీ స్పష్టం చేశారు.

**60 రోజులు స్పెషల్ డ్రైవ్**


కోటి మందికిపైగా జనాభా ఉన్న హైదరాబాద్ మహానగరంలో తాగునీటి సరఫరా విషయంలో జలమండలి అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. 13న్నర లక్షల నల్లా కనెక్షన్లకు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయడంతో పాటు కంటోన్మెంట్ లాంటి ప్రాంతాలకు బల్క్‌గా నీళ్లు ఇచ్చేందుకు ఈ వేసవిలో తర్జన భర్జనపడుతోంది. ఈ క్రమంలో సరఫరాలో నష్టాలు, నీటి దుర్వినియోగం, వృథా చేయడం, లోప్రెషర్ వంటి కారణాలతో జలమండలి నిత్యం విమర్శలు ఎదుర్కొంటోంది. అయినా సరే నడి వేసవిలో చివరి వినియోగదారుడికి కూడా తాగునీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న జలమండలికి కొంతమంది వినియోగదారులు నల్లా కనెక్షన్లకు అక్రమంగా మోటార్లు బిగిస్తూ నీళ్లను తోడుకుంటుండటం పంటికింద రాయిపడినట్లు అయింది. ఈ విషయంపై దృష్టి సారించిన జలమండలి ఎండీ 60 రోజులు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. మోటార్ ఫ్రీ టాప్ వాటర్ పేరుతో నేటి నుంచి చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్ లో ఎండీ నుంచి లైన్ మెన్ వరకు క్షేత్రస్థాయిలో పర్యటించిన నీటి దుర్వినియోగాన్ని అడ్డుకోవాలని ఆదేశించారు. దీంతో నేడు నగర వ్యాప్తంగా 50 జలమండలి విజిలెన్స్ బృందాలు రంగంలోకి తాగునీటి సరఫరాను పరిశీలించాయి. వివిధ ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు, హాస్టళ్ల వద్ద తాగునీటి నల్లా కనెక్షన్లకు మోటార్లు బిగించి అధికంగా నీటిని మళ్లించుకుంటున్న వారిని గుర్తించి మోటార్లు స్వాధీనం చేసుకున్నారు. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సైతం మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీ, కాకతీయహిల్స్ కాలనీలో పర్యటించి తాగునీటిని చెట్లకు, భవన నిర్మాణానికి వినియోగిస్తున్న యజమానులను హెచ్చరించారు. అధికంగా వాటర్ ట్యాంకర్లను బుక్ చేస్తున్న యజమానులను ఎండీ మందలించారు.

**అక్రమ మోటార్లు స్వాధీనం, జరిమానాలు**

వినియోగదారులందరికి సమానంగా నీళ్లు అందించాలనే ఉద్దేశంతోనే అక్రమ మోటార్లను స్వాధీనం చేసుకోవడం, జరిమానాలు విధిస్తున్నామని ఎండీ స్పష్టం చేశారు. 10 మంది చేసే నీటి దుర్వినియోగం వల్ల 90 మంది ఇబ్బంది పడుతున్నారని తెలిపిన అశోక్ రెడ్డి వారిలో అవగాహన కల్పించేందుకు కఠినంగా వ్యవహారిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు తక్కువ ఒత్తిడితో నీళ్లు సరఫరా కావడంపై విమర్శలు వెల్లువెత్తున్న క్రమంలో స్థానికంగా ఉండే లైన్ మెన్లనే బాధ్యులను చేసినట్లు వివరించారు. వారితో నిత్యం మేనేజర్ స్థాయి అధికారి సంప్రదిస్తూనే తాగునీరు చివరి వినియోగదారుడికి అందేలా చూస్తున్నామన్నారు.

**25 మోటార్లు సీజ్**

మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్‌లో మొదటి రోజు అన్ని డివిజన్ లో కలిపి మొత్తం 64 మోటార్లను స్వాధీనం చేసుకోగా 84 మంది వినియోగదారులకు జరిమానా విధించారు. అత్యధికంగా ఎస్ఆర్ నగర్ పరిధిలో 25 మోటార్లు సీజ్ చేసి జరిమానా విధించారు. నల్లాలకు మోటార్లు బిగించి నీటిని తోడుకోవడం నేరంగా పరిగణిస్తున్నట్లు తెలిపిన జలమండలి ప్రజలెవరూ నీటి దుర్వినియోగానికి పాల్పడ్డవద్దని విజ్ఞప్తి చేసింది.




## పాత్రికేయ రంగంలో ప్రతిభ కనబరిచిన మహిళ జర్నలిస్ట్ వీరలత(శ్రీ లత) కు ఉగాది పురస్కారం

**విశాఖపట్నం,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**

తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం (ఆంధ్రప్రదేశ్) ప్రతి సంవత్సరం ప్రఖ్యాతి గాంచిన "ఉగాది పురస్కారాలను" విభిన్న విభాగాలలో అత్యుత్తమ ప్రతిభకనబరిచిన జర్నలిస్టులకు ప్రధానం చేస్తోంది 202425 సంవత్సరానికి గాను ఈ అవార్డుల జాబితాను సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేడ వరపు రంగనాయకులు తాజాగా ప్రకటించారు.ఈ ఏడాది ఈ గౌరవానికి అర్హులైన పలువురు జర్నలిస్టుల పేర్లు ప్రకటించగా జర్నలిజం విభాగంలో విశాఖ పట్నం నకు చెందిన మహిళ సీనియర్ జర్నలిస్టు ఆంధ్రా వాయిస్ స్టాఫ్ రిపోర్టర్ వీర లత ఈ అవార్డు అందుకున్నారు. విజయవాడ తుమ్మల పల్లి వారి కళాక్షేత్రం లో తెలుగు జర్నలిస్ట్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 48వ మాజీ న్యాయమూర్తి ఎన్వి రమణ ముఖ్య అతిధిగా పాల్గొని వీర లత కు ఉగాది పురస్కారం రూ.5 వేల నగదు రివార్డుతో పాటు ప్రశంసాపత్రం అందించి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నిర్మాత,ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు విశిష్ట అతిధిగా హాజరయ్యారు .ఈ సందర్భంగా శ్రీ లత మాట్లాడుతూ పాత్రికేయ రంగానికి తాను అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఉగాది పురస్కారం తో సత్కరించడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు.నిర్వాహకుల మాట్లాడుతూ నిబద్ధత,సమర్పిత సేవలు, వృత్తి ధర్మాన్ని నిలబెట్టే విధంగా చూపిన దృఢత్వం శ్రీలత ను ఈ అవార్డుకు అర్హురాలిగా నిలిపాయన్నారు. సామాజిక స్పృహతో కూడిన కథనాలు ,ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించే విశేష కృషి ఆమెకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయన్నారు.ఈ ప్రత్యేకతలే ఈ ప్రతి ష్టాత్మక పురస్కారం వీర లత(శ్రీ లత) వరించడానికి కారణమయ్యాయని స్పష్టం చేసారు.ఈ సందర్భంగా పి.వీరలత (శ్రీ లత)కు పలు జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు,జర్నలిస్ట్ లు, కుటుంబ సభ్యులు, మిత్రులు అభినందనలు తెలిపారు.



## రిమాండ్ ఖైదీని ములాఖత్‌లో వీడియో తీసిన యువకులు

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- చంచల్‌గూడ జైలు సిబ్బందిపై అధికారులు సీరియస్

**హైదరాబాద్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):** చంచల్‌గూడ జైలు ఖైదీ ములాఖత్‌లో మాట్లాడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న అహ్మద్ బిన్ హసన్ అల్ జాబ్రీని అనే వ్యక్తిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం(ఏప్రిల్ 11) అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు.

**సోషల్ మీడియాలో వైరల్**

అతడిని ములాఖత్‌లో కలిసేందుకు శనివారం(ఏప్రిల్ 12) ఇద్దరు యువకులు చంచల్‌గూడ జైలుకు వెళ్లారు. అనంతరం వారు నిందితుడు అహ్మద్‌తో మాట్లాడుతూ మొబైల్‌లో వీడియో తీశారు. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. దీంతో అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై జైలు అధికారులు సీరియస్ అయ్యారు.

**సిబ్బందిపై చర్యలకు సిఫార్సు**

వీడియో తీసిన ములాఖత్‌దారుతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన జైలు సిబ్బందిపై చర్యలకు అధికారులు ఉపక్రమించారు. ఇప్పటికే ఈ విషయంపై ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు చంచల్‌గూడ జైలు పర్యవేక్షణ అధికారి నవాబు శివకుమార్ గౌడ్ తెలిపారు.



## దాతల సహకారంతోనే సమాజాభివృద్ధి

**మనసు అనాధాశ్రమానికి నిత్యవసర వస్తువులు**

**సింహాచలం,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**దాతల సహకారంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, దయగల హృదయమే దైవ మందిరం అని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు,నేవల్ డాక్ యార్డ్ అసోసియేషన్ (కేటీబీ )గౌరవ అధ్యక్షులు,జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు అన్నారు. ఇక్కడ సింహాచలం రోడ్ లో ఉన్న మనసు అనాధాశ్రమానికి మంగళవారం గంట్ల శ్రీను బాబు కుటుంబ సభ్యులు చేతులు మీదుగా నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలతో పాటు దయగల దాతలు కూడా అత్యంత కీలకమన్నారు. వారు కూడా ముందుకు వచ్చినప్పుడే కొంత మేరకు పేదరికం తగ్గు ముఖము పడుతుంది అన్నారు.. మనసు ఆశ్రమంలో సుమారు 27 మంది చిన్నారులు ఉన్నారని వారంతా వేరువేరు పాఠశాలల్లో ఉన్నత విద్యాభ్యాసం సాగిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి వారిని ఆదుకోవడానికి ప్రభుత్వాలు మరిన్ని పథకాలు అమలు చేయాలన్నారు. పిల్లల పట్ల నిర్వాహకులు తీసుకుంటున్న శ్రద్ధను అభినందించారు. ప్రతీ ఏటా కొంత సామాగ్రి అందచేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో సింహగిరి గ్యాస్ ఏజెన్సీ యజమాని గంట్ల కిరణ్ బాబు ,మారుతి. కళ్యాణ మండపం అధినేత తిరుమల రెడ్డి సుధీర్. ప్రవీణ్, టీడీపీ నాయకులు శ్రీనివాస్ పలువురు స్థానికులు పాల్గొన్నారు.




## 19 వ తేదిన విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు

- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మరియు ఎచ్చెర్ల బిజెపి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ
- ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి
- శ్రీకాకుళం జిల్లాకు సీదరి అప్పలరాజు శని గ్రహం
- కొండలను గుట్టలను మింగిన ఘనుడు సీదరి తెలుగు శక్తి ఆరోపణ
- పోలీసులపై అనుచిత వ్యాఖ్యల చేసిన వైయస్ జగన్మోహన్ రెడ్డి పై ఎఫ్ ఐ ఆర్ కట్టాలి
- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

**పలాస,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్లాటినం జూబ్లీ (75) జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని.. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఉదయం పలాస టిడిపి ఎమ్మెల్యే గౌతు శిరీష మరియు ఎచ్చెర్ల బిజెపి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన పోస్టర్ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పరిపాలనలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా ముందుకెళుతున్నారన్నారు. తెలుగు జాతి ప్రతిష్టను ప్రపంచ స్థాయి తీసుకెళ్లిన వ్యక్తి నారా చంద్రబాబునాయుడు అని ఈ సందర్భంగా ప్రస్తావించారు. విశాఖలోని హోటల్ దసపల్లాలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఇదిలా ఉండగా మే 28వ తేదీన యుగపురుషుడు, అన్న నందమూరి తారక రామారావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారం గా నిర్వహించాలని ప్రభుత్వానికి మరోసారి విజ్ఞప్తి చేశారు.

**శ్రీకాకుళం జిల్లాకు సీదరి అప్పలరాజు శని గ్రహం కొండలను గుట్టలను మింగిన సీదరి అప్పలరాజు**

వైసీపీ అరాచక పరిపాలనలో అప్పటి పలాస ఎమ్మెల్యే సీదరి అప్పలరాజు అక్రమాలు అన్ని ఇన్ని కావన్నారు. ముఖ్యంగా విశాఖపట్నం రాజధాని అవుతుందనే భ్రమను ఉత్తరాంధ్ర ప్రజలలో కల్పించారన్నారు. ఈ నేపథ్యంలోనే పలాసతో పాటు శ్రీకాకుళం ప్రాంతంలోనూ పెద్ద ఎత్తున భూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆనాటి అక్రమాలపై భూ దందాల, కొండలను గుట్టలను మింగిన సీదరి అప్పలరాజు పై కూటమి ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపించాల్సిన అవసరం ఉందన్నారు.



**వైయస్ జగన్మోహన్ రెడ్డి పై ఎఫ్ ఐ ఆర్ కట్టాలి**

ఇదిలా ఉండగా పులివెందుల ఎమ్మెల్యే వైయస్ జగన్మోహన్ రెడ్డి తన ముఖ్యమంత్రి పదవిని ప్రజలు దూరం చేసినప్పటికీ అతనిలో బుద్ధి రాలేదన్నారు. చివరకు శాంతి పద్ధతులను పరిరక్షించే పోలీసులనే దారుణాతి దారుణంగా దూషించడం ఎంత మాత్రం సరికాదన్నారు. పోలీసులను గుడ్డలు ఊడదీసి కొడతామని చెప్పడాన్ని బట్టి వైయస్ జగన్మోహన్ రెడ్డి తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు అని రామ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే తాను గాజువాక పోలీస్ స్టేషన్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి పై ఫిర్యాదు చేయగా.. పోలీసులు కూడా రసీదును ఇచ్చారన్నారు. అయితే తనకు కావలసింది రసీదు మాత్రమే కాదని.. వైయస్ జగన్ పై ఎఫ్ ఐ ఆర్ తెరవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజా (కాంగ్రెస్) ప్రభుత్వాన్ని కూలుస్తామన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలి.

- భూక్యా సురేష్ నాయక్ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు
- రాజ్యాంగాన్ని అవమానించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి అనర్హుడు



**ఖమ్మం,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ ఫిర్యాదు చేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు,ప్రజల చేత రాజ్యాంగబద్ధంగా ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని కూలదోసే కుట్రకు పాల్పడినందుకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్తా ప్రభాకర్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తెలంగాణలో ప్రజలచే రాజ్యాంగబద్ధంగా ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని కూలదోసేలా కుట్రపూరితమైన ప్రకటనలు చేసిన దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అభ్యర్థించారు.దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సోమవారం జరిగిన నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మొత్తం మీద పలువురు వ్యాపారవేత్తలు,రియల్ ఎస్టేట్ డీలర్లు తనను సంప్రదించి, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నారు" అని చెప్పారు.ఈ చర్య ద్వారా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసి,తమ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న ఉద్దేశం ఉన్నదని పేర్కొన్నారు.తాము భావిస్తున్న దాని ప్రకారం ఈ ప్రకటనలు ఒక సీనియర్ ప్రజా ప్రతినిధి చేయడం ప్రజాస్వామ్యానికి శత్రుత్వంగా భావించాలి. ఇలాంటి ప్రకటనలు అవినీతిపరమైన నల్లధనం మాఫియా ,మనీ లాండరింగ్ మాఫియా వలయాల ప్రమేయాన్ని సూచిస్తున్నాయని,ఇది రాష్ట్రంలో చట్టబద్ధమైన పరిపాలనకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని ఫిర్యాదులో పేర్కొంటామని అన్నారు.ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తో పాటు ఆయన్ను కలిసిన పేరులేని వ్యాపారులు,రియల్టర్లు మీద కూడా కేసులు నమోదు చేయాలని, నల్లధనం.మాఫియా, మనీ లాండరింగ్ ద్వారా ప్రోత్సహించబడుతున్న ఈ కుట్రపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే పదవిలో ఉంటూ రాజ్యాంగాన్ని అవమానించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పై అనుచిత వ్యాఖ్యలు

# యువతి మృతదేహంతో యువకుడి ఇంటి వద్ద ఆందోళన

- ప్రేమించి మోసం చేశాడనే మనస్థాపంతో ఓ యువతి ఆత్మహత్య
- మృతదేహంతో యువకుడు జానారెడ్డి ఇంటి ముందు బంధువుల ధర్నా
- హైదరాబాద్‌లో యువతి మృతి



**నల్గొండ ప్రతినిధి ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**ఓ యువకుడు ప్రేమించి వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడనే విషయంలో సరూర్ నగర్‌లో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఇవాళ మృతురాలి బంధువులు మృతదేహంతో నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ఆ యువకుడి ఇంటిముందు ఆందోళనకు దిగారు. ఎంతకీ ఆందోళన విరమించకపోవడంతో పోలీసులు నిందితులకు కచ్చితంగా శిక్ష పడేలా చేస్తామని హామీ ఇవ్వడంతో దహన సంస్కారాలకు ఒప్పుకున్నారు. మృతురాలి బంధువులతో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు ప్రత్యేక హామీ మేరకు ఆందోళన విరమించేలా ఒప్పించారు.

**నిందితులను విడిచిపెట్టం**

ఈ నేపథ్యంలో డీఎస్పీ మాట్లాడుతూ ఆ యువతి మృతికి కారణమైన వారందరి పేర్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చేందుకు నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సరూర్‌నగర్ పోలీసులతో సంప్రదింపులు జరిపినట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో నిందితులను వదలబోమని డీఎస్పీ తేల్చి చెప్పారు. బాధితులకు ఎట్టి పరిస్థితుల్లో న్యాయం చేస్తామని తెలిపారు.

"బొక్కమంతలపహడ్‌కు ధర్మారపు మల్లేశ్వరి అనే యువతి హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదైంది. దానిలో కొంత మంది నిందితుల పేర్లు చేర్చలేదనే కారణంతో ఆందోళన చేయడం జరిగింది. నిందితులు ఎవరైతే ఉన్నారో వారి అందరి పేర్లు చేర్చి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఎస్పీ అక్కడి డీసీపీతో మాట్లాడటం జరిగింది. ఈ కేసులో తప్పకుండా న్యాయం చేస్తాం" రాజశేఖర రాజు, మిర్యాలగూడ డీఎస్పీ

వివరాల్లోకి వెళ్తే నల్గొండ జిల్లా నిడమనూర్ మండల బొక్కమంతలపహడ్‌కు చెందిన కుక్కల జానారెడ్డి, అదే గ్రామంలోని ధర్మారపు మల్లేశ్వరి అనే యువతి ప్రేమించుకున్నారు. ఇటీవల జానారెడ్డి మరో యువతిని వివాహం చేసుకున్నాడన్న విషయం తెలుసుకున్న మల్లేశ్వరి తీవ్ర మనస్థాపంతో సోమవారం(ఏప్రిల్ 14) ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి యువకుడి ఇంటి ముందు పెట్టి ధర్నాకు దిగారు. మృతదేహాన్ని అక్కడి నుంచి తొలగించాలని కోరితే అంగీకరించలేదు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మృతిరాలి తరపు బంధువులు అంగీకరించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్య వాదాలు తెలియజేసిన : కాశపాగ ఇమ్మయ్య

**సంగారెడ్డి ఏఫ్రిల్ 15(ప్రజాక్షేత్రం):**ఎస్సి ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మనిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య మాట్లాడుతు మందకృష్ణ మాదిగ గత 30సంవత్సరాలుగా నిరంతర పోరాటం చేసి అనేక ఒడిదుడుకులకు తట్టుకొని ఎక్కడ కూడా ఉద్యమాన్ని ఆపకుండా పనిచేసి చివరిగా అంతిమ విజయాన్ని సాధించిన మందకృష్ణ మాదిగకి మాదిగ సమాజం మొత్తం రుణపడి ఉంటుందని ఇంత సుదీర్ఘ పోరాటానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం దేశంలోనే మొట్టమొదటిగా సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి చట్టసభల్లో వర్గీకరణ బిల్లును ఆమోదించి జీవోను పాస్ చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్రంలో ప్రజలు అండదండలుగా ఉంటారని మాదిగలు మాటకు కట్టుబడి ఉంటారని దేశంలో ఇప్పటికే అనేక సార్లు రుజువు అయిందని భవిష్యత్తులో కూడా మాదిగలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టి చూసుకుంటారని అయన హర్షం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్ట్ తీర్పు తర్వాత కొంతమంది స్వార్ధ పరులు చేసిన ఆగడాలను చూస్తే జాలి వేసిందని ఎవరి వాట వాళ్లకు ఇస్తే విల్లకు వచ్చే నష్టం ఏముచ్చిందో అర్థం కాకా రాష్ట్రంలో చాలా మంది దగ్గర నవ్వులపాలు అయ్యారని ఇకముందు అయినా అన్నదమ్ముల లాగా కలసిమెలసి ఉండాలని హితావు పలికారు.



## వైల్డ్ హార్ట్ పబ్‌లో అసభ్య నృత్యాలు పోలీసుల అదుపులో 16 మంది యువతులు

- చైతన్యపురి పరిధిలోని వైల్డ్ హార్ట్ పబ్‌లో పోలీసుల తనిఖీలు
- యువతులతో అసభ్య నృత్యాలు చేయిస్తున్నారనే సమాచారంతో సోదాలు
- వివరాలను వెల్లడించిన చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు


**చైతన్యపురి ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**హైదరాబాద్ నగరంలోని చైతన్యపురి పరిధిలో గల వైల్డ్ హార్ట్ పబ్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. యువతులతో అసభ్య నృత్యాలను చేయిస్తున్నారనే సమాచారంపై రంగంలోకి దిగిన చైతన్యపురి పోలీసులు, ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే 17 మందిని అదుపులోకి తీసుకుని చైతన్యపురి పోలీసులకు అప్పగించారు. పబ్ నిర్వాహకుడితో పాటు కస్టమర్లకు నోటీసులు ఇచ్చారు. సోదాలకు సంబంధించిన వివరాలను చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ పోలీసులకు వెల్లడించారు.

**చైతన్యపురి పోలీస్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం**

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అసభ్యకరమైన నృత్యాలు ప్రదర్శిస్తున్నారనే సమాచారంతో వైల్డ్ హార్ట్ పబ్‌పై దాడులు నిర్వహించామని చైతన్యపురి పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ రావు వెల్లడించారు. ఈ సందర్భంగా వినియోగదారులతో అసభ్యంగా నృత్యాలు చేస్తున్న 16మంది యువతులతో పాటు ఓ డీజే ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకున్నామని వెంకటేశ్వర్‌రావు తెలిపారు. డీజే ఆపరేటర్ నేర అంగీకారం ప్రకారం పబ్బు యజమాని రాము యువతులను ఫ్రీ ఎంట్రీ పేరుతో ఎంగేజ్ చేసుకున్నారని పేర్కొన్నారు.

"నిన్నటి రాత్రి చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో వైల్డ్ హార్ట్స్ పబ్‌లో రాత్రి 10 గంటల యువతులతో అసభ్యకర నృత్యాలు చేయిస్తున్నారనే సమాచారం వచ్చింది. చైతన్యపురి ఎస్ .ఐ, మహిళా సిబ్బంది వెళ్లి దాడులు నిర్వహించడం జరిగింది. అక్కడ వేరే జంట్స్‌తో డ్యాన్సులు చేస్తూ యువతులు అబ్‌సీన్‌గా ఉంటే రైడ్ చేయడం జరిగింది. ఫ్రీ ఎంట్రీ అని చెప్పి లోకల్ యువతులను నిర్వాహకులు ఎంగేజ్ చేస్తున్నారు. పబ్‌కు సింగిల్‌గా వచ్చే కస్టమర్లే టార్గెట్‌గా అబ్‌సీన్‌గా ఉండాలని చెప్పి నిర్వాహకులు యువతులకు చెబుతున్నారు. రూల్స్ అతిక్రమణ, న్యూసెన్స్, అబ్‌సీన్ కింద కేసులు నమోదు చేయడం జరిగింది" వెంకటేశ్వర రావు, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం

ఆ యువతులను పబ్‌కు ఒంటరిగా వచ్చే యువకుల దగ్గరికి వెళ్లి వాళ్లతో అసభ్యంగా డాన్సులు చేయమని చెప్పి వాళ్లతో మందు అధికంగా తాగించేలా చేసి బిల్లు అధికంగా అయ్యేలావిధంగా కస్టమర్లను మోసం చేస్తున్నారని సీఐ వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఈ అశ్లీల కార్యకలాపాలకును నిర్వహిస్తున్న బారు ఓనరుతో పాటు మేనేజర్ సంతోశ్ పరారీలో ఉన్నారని తెలిపారు.






## బిఆర్ఎస్ పార్టీ రజితోత్సవ సభను విజయవంతం చేద్దాం

**రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి**

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 15 (ప్రజాక్షేత్రం):**భారత రాష్ట్ర సమితి పార్టీ 24 వసంతాలు పూర్తి చేసుకొని 25 వ సంవత్సరములో అడుగు పెడుతున్న పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సంబరాల విజయవంతం చేద్దామని రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తిక్ రెడ్డి అన్నారు. మంగళవారం గండిపేట్ మండలం మణికొండ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలతో కలిసి బిఆర్ఎస్ దినోత్సవం జరుపుకునే విషయమై రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం రాజేంద్రనగర్ పార్టీ ఇన్చార్జి యువ నాయకుడు కార్తీక్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ స్థానిక నాయకులు అందరూ కలసి ఏకగ్రీవ తీర్మానం చేశారు, ఈ నెల 27 ఏప్రిల్ నెక్నంపూర్, పుప్పాల గూడ ఎల్ఐసి కూడలిలలో అలాగే మణికొండ, పాత ఆంధ్ర బ్యాంకు కూడలిలో, మర్రి చెట్టు కూడలిలో మొత్తంగా 4 చోట్ల పెద్ద ఎత్తున పార్టీ జండా ఆవిష్కరించిన అనంతరం ఉద్యమాల పురిటిగడ్డ ఓరుగల్లుగడ్డకు పయనమై హనుమకొండ సమీపంలోని ఎలకతూర్తి గ్రామ కూడలిలో జరుగు పార్టీ ఆవిర్భావ రజతోత్సవ ఉత్సవాల సభకు మణికొండ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రతీ ఒక్క గులాబీదళ సైనికుడు కలసి కట్టుగా పెద్ద సంఖ్యలో కదం కదం తొక్కితూ తరలి వెళ్ళడానికి కృత నిశ్చయంతో ఉన్నామని అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ తెలిపారు.



## ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిత్రకారులకు ఘనంగా సన్మానం

- ఘనంగా ప్రపంచ చిత్రకారుల దినోత్సవం
- చిత్రకారులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి:ప్రముఖచిత్రకారుడు శిల్ప భాస్కర్.

**జమ్మికుంట,ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం ):**జమ్మికుంట పట్టణంలోని ప్రపంచ చిత్రకారుల దినోత్సవం సందర్భంగా జమ్మికుంట ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభు ఆర్ట్స్ గ్యాలరీ లో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సీనియర్ ఆర్టిస్ట్ శిల్ప భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచ చిత్రకారుల దినోత్సవం జరుపుకోవడం గర్వకారణమని అన్నారు అదేవిధంగా టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఫ్లెక్సీలు,ప్రింటింగ్‌లు అభివృద్ధి కావడం వల్ల చిత్రకారులకు ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.ఫ్లెక్సీలు రావడం ఉపాధి కోల్పోయి కుటుంబాన్ని పోషించలేక ఇబ్బందులు పడి అప్పుల పాలు అవుతున్నారని అన్నారు.నిరుపేదలైనటువంటి చిత్రకారులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకమైన పథకాలు అందించాలని కోరారు. అదే విధంగా రెండున్నర దశాబ్దాలుగా చిత్రకారుడిగా తనదైన శైలిలో చిత్రాలను గీస్తూ ప్రజలు అధికారులు,ప్రజా సంఘాల నాయకులు,ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు,రాజకీయ నాయకుల మన్ననలు పొందడం తో పాటు గత 25 సంవత్సరాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేయడమే కాకుండా జర్నలిస్ట్ సమస్యలపై పోరాడిన గొప్ప నాయకుడిగా పని చేస్తూ ఇటీవల వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా డబ్ల్యూ జే ఐజమ్మికుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికైన అంబాల ప్రభాకర్ ప్రభు ఆర్టిస్ట్ ను శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం సీనియర్ ఆర్టిస్టులు శిల్ప భాస్కర్,వీరస్వామి,బ్రహ్మం, భువనేశ్వర్,సంతోష్ లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు భువనేశ్వర్ శ్రీరాం, ఆర్ట్ ప్రధాన కార్యదర్శి సంతోష్ సంతు,ఆర్ట్ సీనియర్ ఆర్టిస్ట్ వీర స్వామి,సిటీ ఆర్ట్& రేడియంబ్రహ్మం,బ్రహ్మ ఆర్ట్ రేడియం సాయినాథ్ మెర్సీ ఆర్ట్ శ్రీనివాస్ శ్రీను ఆర్ట్,సంపత్ సంపత్ ఆర్ట్,హుజురాబాద్ ఆర్టిస్ట్ ప్రవీణ్ తదితరులు



## నేటి నుంచి ఉచిత కోచింగ్ ప్రారంభం



**మహబూబ్ నగర్ ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన సొంత నిధులతో మహబూబ్ నగర్ నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్, వీఆర్వో, వీఆర్ఏ, టెట్, డీఎస్సీ తదితర గ్రూప్ పరీక్షలకు హైదరాబాద్ ఫ్యాకల్టీ వారిచే స్థానిక అంబేద్కర్ కళాభవన్ లో ఉచిత కోచింగ్ ఇప్పిస్తున్నట్లు పర్యవేక్షకులు గుండా మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. కోచింగ్ తీసుకుంటున్న వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్స్ ను కూడా అందిస్తామని, ఇందుకు సంబంధించిన ఇతర సమాచారం కోసం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ఫోన్ నెంబర్లు 7989099197, 8639260193 లకు కాల్ చేయవచ్చు అని ఆయన తెలిపారు

## వారిని అన్ని రకాలుగా ఆదుకుంటాం...!

**ఖమ్మం ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం):** ప్రభుత్వం చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్వాసితులు, తీగల వంతెన బాధితులతో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తో చర్చలు జరిపి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ కమిటీ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, పార్టీ డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ మాట్లాడుతూ.. 2013 సంవత్సరం ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.నిర్వాసితులకు న్యాయం తగిన న్యాయం చేయడంలో అధికారులు ఒక తీరుగా, మంత్రులు ఒక తీరుగా వ్యవహరిస్తున్నారు అని తెలిపారు. ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు నగరంలోనే ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు, తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు నిర్వాసితులకు భూమి ఇవ్వడానికి కేంద్రీయ విశ్వవిద్యాలయం వద్ద రైతుల భూములు లాక్కుంటే సహించేది లేదని హెచ్చరించారు. రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి 2013 చట్టం కింద నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకోవైపు తీగల వంతెన కోసం 100 కుటుంబాలు నష్టపోతున్నారు అని వారికి కూడా తగిన విధంగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు తీగల వంతెన దాదాపు నయా బజార్ వరుకు రావడంతో అక్కడ చిరు షాపుల యాజమానులు నష్టపోతారని వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు . ఈ సందర్భంగా JC మాట్లాడుతూ బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో పార్టీ త్రీ టౌన్ కార్యదర్శి భుక్యా శ్రీనువాసురావు, కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, SK ఖాసీం , భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి


**రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి**

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 15(ప్రజాక్షేత్రం ):**బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్లో మంగళవారం రాజేంద్రనగర్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి అధ్యర్యంలో ఈ నెల 27 న వరంగల్ లో జరగబోయే బిఆర్ఎస్ పార్టీ రజతోస్తావ కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కలిసి మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ రజతోస్తావ సభ భారీ సంఖ్య పాల్గొని విజయవంతం చేయాలి ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రావులకోల్ల నాగరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్, రవీందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రాముడుయాదవ్, ఆర్గనైజషన్ సెక్రటరీ గంగని రవికుమార్, పార్టీ సీనియర్ నాయకులు నారాయణ, సుధాకర్ గౌడ్, వేంకటేష్, చంద్రశేఖర్, మహేష్, కీర్తికాంత్,మహేందర్, గోవర్ధన్, పెంటయ్య, ఇంతియాజ్, సందీప్, యాదగిరి, ఉదయ్, హరి, మాధవి, మల్లేశ్వరి, జ్యోతి,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# హరి హర వీరమల్లు రూమర్స్‌కి చెక్

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'హరి హర వీరమల్లు' క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా సిద్ధమవుతోంది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీపై నిర్మాత పోస్ట్ పెట్టారు. అనుకున్న సమయానికే దీన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. కొన్ని రోజులుగా ఈ సినిమా విడుదల ఆలస్యం కానున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలోనే చిత్రబృందం దీని రిలీజ్‌పై మరోసారి స్పష్టతనిస్తూ పోస్ట్ పెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 'హరి హర వీరమల్లు' పనులు శరవేగంగా జరుగుతున్నట్లు నిర్మాత తెలిపారు. రీ రికార్డింగ్, డబ్బింగ్, వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ వేసవికి ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాను అందిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల ప్రకటించినట్లే మే9న ఈ చిత్రం విడుదల కానుందని.. ప్రేక్షకులంతా మునుపెన్నడూ చూడని సినిమాటిక్ అనుభూతికి సిద్ధంగా ఉండాలని కోరారు. ఈవిషయాన్ని తెలుపుతూ పవన్‌కు సంబంధించిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.







# పెళ్లి పై క్లారిటీ ఇచ్చిన మిల్క్ బ్యూటీ

హీరోయిన్లు ప్రేమ-పెళ్లి విషయంలో ఆచితూచి అడుగులేస్తుంటారు. త్వరగా పెళ్లి చేసుకుంటే కెరీర్ ముగిసిపోతుందేమోనని భయం, కొన్నిసార్లు బ్రేకప్ వల్ల కూడా పెళ్లి చేసుకోవడం చాలా లేటు చేస్తుంటారు. మొన్నీమధ్య తమన్నాని ఇప్పుడు పెళ్లి గురించి అడిగితే ఏం సమాధానమిచ్చిందో తెలుసా? దాదాపు 20 ఏళ్లుగా నటిగా కొనసాగుతున్న తమన్నా.. దక్షిణాదితో పాటు హిందీలోనూ సినిమాలు- ఐటమ్ సాంగ్స్ చేస్తూ ఫుల్ బిజీగా ఉంది. గత రెండేళ్లుగా నటుడు విజయ్ వర్మతో ప్రేమలో ఉందని తెగ రూమర్స్ వినిపించాయి. అందుకు తగ్గట్లు కలిసి చాలాసార్లు కనిపించారు. మరి ఏమైందో ఏమో గానీ కొన్నిరోజుల క్రితం వీళ్ల బ్రేకప్ న్యూస్ బయటకొచ్చింది. అది నిజమేనని కొన్ని సంఘటనల ద్వారా క్లారిటీ వచ్చింది. తాజాగా ఓదెల 2 సినిమా ప్రమోషన్లలో భాగంగా తమన్నాని పెళ్లెప్పుడు అని అడిగితే.. ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదని చెప్పింది. తమన్నా ప్రస్తుత వయసు 35 ఏళ్లు. మరి ప్రస్తుతానికి పెళ్లి ఆలోచన లేదని చెప్పిందా? లేదంటే మొత్తానికి ఒంటరిగా ఉండిపోతుందా అని అభిమానులు అనుకుంటున్నారు.

# రెమ్యునరేషన్‌లో టాప్ డైరెక్టర్లు వీళ్లేనంటా..?



సినిమా రెమ్యునరేషన్‌ల విషయానికి వస్తే ఎప్పుడూ నటీనటులదే చర్చకు వస్తుంది కానీ దర్శకులు, ఇతర సాంకేతిక నిపుణుల గురించి రాదు. కానీ ఇదంతా గతం... ఇప్పుడు రెమ్యునరేషన్స్ విషయంలో సినిమా దర్శకులు హీరోలతో ఢీ అంటే ఢీ అంటున్నారు. కొందరు దర్శకులైతే టాప్ హీరోలతో సమానంగా రెమ్యునరేషన్లు తీసుకుంటున్నారు. అందుకే ఇప్పుడు దర్శకుల పారితోషికాలు కూడా చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటున్న దర్శకుడిగా టాలీవుడ్ మెగా డైరెక్టర్ రాజమౌళి నెం 1 స్థానంలో ఉన్నాడంటా. బాహుబలి 1, 2లతో పాటు RRRల ద్వారా వందలు, వేల కోట్ల కలెక్షన్లతో చరిత్రను తిరగరాసిన ఈ డైరెక్టర్... దాదాపుగా రూ.200 కోట్ల పారితోషికం అందుకుంటున్నట్టు తెలుస్తోంది. 2వ స్థానంలో కూడా తెలుగుదర్శకుడైన సందీప్ రెడ్డి వంగా ఉండడం విశేషం. తెలుగు అర్జున్‌రెడ్డి తర్వాత ఒక్కసారిగా బాలీవుడ్‌కి ఎదిగిపోయిన సందీప్... అర్జున్ రెడ్డి హిందీ రీమేక్, ఆ తర్వాత యానిమల్ సినిమాలతో రూ.100 నుంచి రూ.150 కోట్లు డిమాండ్ చేసే స్థాయికి వెళ్లాడు. ఏకంగా నెం. 2 స్థానంలోకి ఎగిరి కూర్చున్నాడు.

జవాన్ కోసం రూ. 30 కోట్లను మాత్రమే అందుకున్న ఈ దర్శకుడు ఇప్పుడు ఒకేసారి రూ. 100 కోట్లకు అంటే.. దాదాపుగా 233% తన పారితోషికం పెంచేశాడు. ఈ డీల్ భారతదేశంలో అత్యధిక పారితోషికం తీసుకునే డైరెక్టర్‌గా అట్లీని మూడవ స్థానంలో నిలిపింది. ఆ తర్వాత రూ.80 కోట్లతో 4వ స్థానంలో బాలీవుడ్ దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ, రూ.75 కోట్లతో 5వస్థానంలో సుకుమార్, రూ. 55-65 కోట్లతో సంజయ్ లీలా భన్సాలీలు ఉన్నారు.

సెలబ్రిటీలు పబ్లిక్ ఫిగర్స్. అందుకే పలువురు నెటిజన్లు.. హీరోహీరోయిన్లపై అప్పడప్పుడు నోటికొచ్చిన కామెంట్స్ చేస్తుంటారు. అయితే ఇలాంటి వాటిని సదరు నటీనటులు పెద్దగా పట్టించుకోరు. ఒకవేళ పట్టించుకుంటే మాత్రం కాస్త గట్టిగానే ఇచ్చేస్తుంటారు. హీరోయిన్ నిధి అగర్వాల్ ఇప్పుడు ఓ కుర్రాడికి అలానే కౌంటర్ ఇచ్చింది.

నిధి అగర్వాల్ గురించి ఓ ట్విటర్ పేజీలో పోస్ట్ పెట్టగా.. దీనికి స్పందించిన ఓ నెటిజన్ ఈమెని శ్రీలల పోలుస్తూ వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశాడు. 2021లో వచ్చిన శ్రీలీల 20కి పైగా సినిమాలు చేసింది. 'ఇస్మార్ట్ శంకర్' తర్వాత నిధి ఏం చేసింది? ఎన్ని మూవీస్ చేసింది? అని అన్నాడు. ఈ ట్వీట్ పై స్వయంగా స్పందించిన నిధి అగర్వాల్ సదరు నెటిజన్ కి లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చేసింది. 'ఇస్మార్ట్ శంకర్ తర్వాత హీరో మూవీ చేసింది. తమిళంలో మూడు మూవీస్ చేసింది. హరిహర వీరమల్లుకి సంతకం చేసింది. మంచి స్క్రిప్ట్ లు అనుకున్న వాటికే సంతకం చేస్తున్నా. అందుకు టైమ్ తీసుకుంటున్నాను. కొన్నిసార్లు నా నిర్ణయం తప్పయి ఉండొచ్చు. కానీ మంచి సినిమాలు చేయాలనేది నా అభిప్రాయం. వరసగా సినిమాలు చేయాలనే తొందరేం లేదు. ఈ ఇండస్ట్రీలోనే ఉండాలనుకుంటున్నా. కాబట్టి బ్రదర్.. నా గురించి నువ్వేం బాధపడకు అని చెప్పుకొచ్చింది.

# లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చిపడేసిన నిధి అగర్వాల్

PRINTED, PUBLISHED AND OWNER BY K PRAVEEN KUMAR, PRINTED AT M R PUBLICATIONS, #631880, VANASTHALIPURAM, RANGA REDDY (DIST), HYDERABAD, TELANGANA 500070. PUBLISHED AT H.NO. 250 SHANKAR PALLY, RANGA REDDY, HYDERABAD, TELANGANA 501203. EDITOR : K PRAVEEN KUMAR. PHONE NUMBER 9177920459, EMAIL ID : PRAJAKSHETRAM1@GMAIL.COM, HTTPS://PRAJAKSHETRAM.IN, RNI NO. TELTEL/12330